


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

21.09.2026
సోమవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 82
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# 1000కి పైగా డ్రోన్లతో కల్లోలం

- రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద దాడి
- రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున
- మాస్కో ప్రాంతంలో డ్రోన్ దాడి
- చమురు శుద్ధి కర్మాగారంలో అగ్నిప్రమాదం.
- దాడికి ఉక్రెయిన్ కారణమని రష్యా ఆరోపణలు



మాస్కో, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద దాడికి పాల్పడింది. రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున మాస్కోపై డ్రోన్ దాడి జరిగింది. 1000కి పైగా డ్రోన్లలో ఉక్రెయిన్ మాస్కోపై విరుచుకుపడింది. ఈ డ్రోన్ దాడిలో మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారం దెబ్బతింది. దాడి తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడిలో ఇద్దరు మరణించినట్లు సమాచారం. శనివారం రాత్రి జరిగిన ఈ దాడి రష్యాను గణనీయంగా దెబ్బతీసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ అన్నారు. రష్యాకు చెందిన ఒక చమురు ఉత్పత్తి కేంద్రం, లాజిస్టిక్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి ఈ లాజిస్టిక్ కేంద్రాలు కీలకంగా ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో ఎఫ్‌పీ 1, ఆర్ 100, మిచ్ 2000, పాలియానిట్సియా, వెండెట్టా, లియుటి, బార్స్, ఫ్లెమింగో, సిచెన్, పెలికాన్ వంటి వ్యవస్థలను ఉపయోగించారు. యుద్ధాన్ని ముగించేందుకు శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని రష్యాకు జెలెన్స్కీ సూచించారు. ఇంధనం, ఆహార భద్రత రంగాలలో ఉద్రిక్తతల్ని తగ్గించే మార్గాలు ఉన్నాయని, దీనికి రాజకీయ సంకల్పం అవసరమని చెప్పారు. రష్యాలో పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు ఈ దాడి జరిగింది. ఈ ఎన్నికలు ఉక్రెయిన్‌పై పుతిన్ సాగిస్తున్న యుద్ధానికి ఓ పరీక్షగా నిలిచాయి. రష్యా ఈ దాడికి ఉక్రెయిన్‌ను నిందించింది. మరోవైపు ఉక్రెయిన్ రష్యా నిర్వహిస్తున్న ఎన్నికల్ని తిరస్కరించింది. ఎన్నికల సమయంలో ఆన్‌లైన్ ఓటింగ్‌పై సైబర్ దాడి ప్రయత్నం జరిగినట్లు రష్యా ఎన్నికల అధికారులు తెలిపారు. ■

# స్టూడెంట్స్ యూనిఫాం ఆకర్షణీయంగా ఉండాలి

- అధికారులకు సూచించిన సీఎం రేవంత్
- డిజైన్లలో వైవిద్యానికి ప్రయత్నించాలి
- రెండో జత యూనిఫాం నెలాఖరులోగా ఇవ్వాలి
- కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో రెండు జతలు
- నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయింది
- మౌలిక వసతులు అందజేత



హైదరాబాద్, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని చెప్పారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సమావేశంలో అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తయిందని అధికారులు వివరించారు.

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు.

ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని అన్నారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి , ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ■



# 'ఇది నీచమైన చర్య'

- రాహుల్ గాంధీపై బీజేపీ నేతల ఫైర్
- 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో
- రాహుల్ కి సంబంధించిన వీడియో వివాదాస్పదం

2లో..



# వచ్చే రోజుల్లో దేశంపై తీవ్ర ప్రభావం

- ఎల్ నినోపై భారత వాతావరణ శాస్త్రవేత్తల ఆందోళన
- వేడి, వర్షా భావం, నీటి కొరత వంటి పరిస్థితులు
- వ్యవసాయం, అడవులు, పశుపోషణపై తీవ్ర ప్రభావం!

హైదరాబాద్, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

రాబోయే కొన్ని రోజుల్లో భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 202627 ఎల్‌నినో సాధారణం కన్నా శక్తివంతంగా ఉండొచ్చని 180 మందికి పైగా పర్యావరణ, వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది దేశంలోని అడవులు, నదులు, సముద్రాలు, పర్వతాలు, వన్యప్రాణులపై తీవ్రమైన ప్రభావం చూపొచ్చని అంటున్నారు.

2లో..

# వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు నో పర్మిషన్

- 2 రోజుల్లో గుండెపోటుతో ఐదుగురు మృతి
- గణేష్ నిమజ్జనాల్లో డీజే మోత
- తెలుగు రాష్ట్రాల్లో విషాద ఛాయలు
- జాగ్రత్తలు తీసుకోవాలి: రఘురామకృష్ణరాజు

5లో..

# విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

- మంత్రి నారా లోకేష్ వెల్లడి
- కాకినాడ జిల్లాలో పర్యటించిన మంత్రి
- విద్యతో సమాజంలో మార్పు తీసుకురావొచ్చు
- విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

2లో..



# రాష్ట్రంలో రాక్షస రాజ్యం వచ్చింది

- రైతు రాజ్యం పోయింది
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- రైతుల కష్టాలకు కాంగ్రెస్‌దే బాధ్యత అంటూ ఆరోపణలు
- విద్యుత్ కోతలపై కోమటిరెడ్డికి హరీశ్ సవాల్
- భూకబ్జాలు, కమీషన్లపై సంచలన ఆరోపణలు

2లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 20,
అనంత జనశక్తి న్యూస్

యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఉన్న రైతు రాజ్యం పోయి, ప్రస్తుతం రాక్షస రాజ్యం వచ్చిందని ఆయన మండిపడ్డారు.

# 10 మంది విద్యార్థినుల జడల కత్తిరించారు



5లో..

# భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా
- బి. రాజకుమారిని రైల్వే ఐజీగా బదిలీ
- విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్

5లో..

అమరావతి, సెప్టెంబర్ 20,
అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీలకు సంబంధించి అధికారులు, వారి కొత్త పోస్టింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఎఫ్ డీజీగా పనిచేస్తున్న సీహెచ్ త్రివిక్రమ వర్మను డైరెక్టర్ ఎఫ్ఎస్ఎల్‌గా ప్రభుత్వం నియమించింది.



# మేము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20,
అనంతజనశక్తి న్యూస్

కోస్గి వేదికగా నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాంచజన్య సంకల్ప సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలో ఈ సభ నిర్వహించడం కూడా రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది. కోస్గి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సభలో కవిత తన రాజకీయ ప్రయాణం, బహుజన రాజకీయాలపై మాట్లాడటంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కోస్గి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పాత జ్ఞాపకాలను ఈ సభలో కవిత ప్రస్తావించారు.



5లో..



# రాష్ట్రంలో రాక్షస రాజ్యం వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పూర్తిగా మిల్లర్లు, దళారుల చేతిలో కీలుబొమ్మగా మారిందని, కాంగ్రెస్ పాలనా వైఫల్యం , నిర్లక్ష్యం వల్లే ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో "ఆంధ్రప్రదేశ్ కు నీళ్లు.. తెలంగాణకు కన్నీళ్లు" అనే దుస్థితి దాపురించిందని విమర్శించారు.

**విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు.. మంత్రి కోమటిరెడ్డికి సవాల్**

బొగ్గు కొరత ఉందనే నెపంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విద్యుత్ కోతలు పెరిగిపోయి రైతులకు తీవ్ర శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రతిపక్ష ఎంపీగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్ స్టేషన్లకు వెళ్లి లాగ్ బుక్‌లను తనిఖీ చేసిన ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ఇప్పుడు సొంత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న కోతలపై లాగ్ బుక్‌లను చూసే దమ్ము, ధైర్యం ఉన్నాయా అని హరీష్ రావు నేరుగా సవాల్ విసిరారు.

**భూకబ్జాలు, కమీషన్ల పాలన.. ఎంపీలకు హితవు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రంలో యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నారని హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కబ్జాలను తాము నిలదీస్తున్నందుకే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. రాజ్యంలో భూమి క్లియరెన్స్ కావాలంటే 30 శాతం, కాంట్రాక్ట్ బిల్లులు పాస్ కావాలంటే 15 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీలు పొలాల్లో తిరుగుతూ డ్రామాలు చేయడం మాని, రీజినల్ రింగ్ రోడ్డు , మెట్రో రెండో దశ నిధులు, కృష్ణా నదిలో తెలంగాణ నీటి వాటా సాధన కోసం ఢిల్లీ వేదికగా పోరాటాలు చేయాలని హితవు పలికారు.

**ఆరు గ్యారంటీలపై నిలదీస్తాం.. కేసీఆర్ కంటే గొప్పగా పనిచేయాలి**

తమకు ఉద్యమాలు, పోరాటాలు, జైలు కేసులు కొత్తేమీ కాదని, రేవంత్ రెడ్డి ఎన్ని బెదిరింపులకు దిగినా భయపడే ప్రసక్తే లేదని హరీష్ రావు తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, నిరంతరం నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నాయకులు కేసీఆర్ చావును కోరుకోవడం మాని, చేతనైతే కేసీఆర్ సాధించిన అభివృద్ధి కంటే గొప్పగా పనిచేసి చూపించాలని హరీష్ రావు సవాలు విసిరారు.

# సచివాలయ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## 6 ఏళ్ల సర్వీస్ పూర్తి చేస్తే.. 11 పీఆర్సీ ప్రయోజనాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అర్హులైన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) కింద ప్రత్యేక గ్రేడ్ పోస్టు స్కేల్ వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు జారీ అయ్యాయి. 11వ వేతన సవరణ సంఘం (11వ పీఆర్సీ)లో పేర్కొన్న నిబంధనలు, విధివిధానాల ప్రకారం ఈ ప్రయోజనాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఒకే కేడర్‌లో 6 ఏళ్ల సర్వీసును పూర్తి చేసినట్లయితే.. నిర్ణీత నిబంధనల ప్రకారం వారికి స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్ మంజూరు చేయనున్నారు. దీనివల్ల అర్హత పొందిన ఉద్యోగుల పే స్కేల్‌లో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇది సాధారణ పదోన్నతి కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉద్యోగి అదే పోస్టులో కొనసాగుతున్నప్పటికీ.. నిర్దిష్ట కాలం సర్వీసు పూర్తి అయిన తర్వాత ఆర్థిక ప్రయోజనం కల్పించే విధానమే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అని పేర్కొన్నారు.

తాజా నిర్ణయంతో ముఖ్యంగా 2019, 2020లో నియమితులైన స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బందికి ప్రయోజనం కలగనుంది. అప్పుడు ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకోనున్నారు. అయితే కేవలం నియామక సంవత్సరం ఆధారంగా కాకుండా.. ప్రతి ఉద్యోగి సర్వీస్ రికార్డు, అర్హతలు, వర్తించే నిబంధనలను పరిశీలించిన తర్వాతే స్పెషల్ గ్రేడ్ స్కేల్ మంజూరు చేయనున్నారు. ఈ మేరకు సంబంధిత సిబ్బంది సర్వీసు వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న ఉద్యోగులను గుర్తించి తదుపరి ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

ఒకే పోస్టులో ఎక్కువకాలం పనిచేసే ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు అందుబాటులో లేకపోయినా ఆర్థికంగా కొంత పురోగతి కల్పించేందుకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలు చేస్తారు. ఈ విధానంలో నిర్ణీత సంవత్సరాల సర్వీసు పూర్తయిన తర్వాత ఉద్యోగులకు వరుసగా ఆర్థిక ప్రయోజనాలు కల్పించే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఆరు ఏళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత స్పెషల్ గ్రేడ్ ప్రయోజనం, అనంతరం నిబంధనలకు అనుగుణంగా 12, 18, 24 సంవత్సరాల సర్వీసు దశల్లో తదుపరి ప్రయోజనాలు కల్పించే విధానం ఉంది. 11వ పీఆర్సీ నిబంధనల ప్రకారం ఈ విధానాన్ని వర్తింపజేయనున్నారు.

ఏఏఎస్ కింద లభించే స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్‌ను ఉద్యోగి సాధారణ ప్రమోషన్‌గా భావించకూడదని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగి హోదా, కేడర్‌లో మార్పు లేకుండానే నిర్దిష్ట సర్వీసు కాలాన్ని పూర్తి చేసినందుకు లభించే ఆర్థిక ప్రయోజనంగా దీనిని పరిగణిస్తారని పేర్కొంటున్నారు. సచివాలయ ఉద్యోగులకు పరిమితమైన ప్రమోషన్ అవకాశాల నేపథ్యంలో ఈ విధానం ఆర్థిక పురోగతికి ఉపయోగపడుతుందని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన అర్హులైన సిబ్బందికి ఈ ప్రయోజనం పొందేందుకు మార్గం సుగమమైంది. ఇక సంబంధిత శాఖలు ఉద్యోగుల సర్వీస్ రికార్డులను పరిశీలించి.. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారికి స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేల్ మంజూరు చేసే ప్రక్రియను చేపట్టనున్నాయి. దీంతో 2019, 2020 బ్యాచ్‌లకు చెందిన అర్హులైన సచివాలయ ఉద్యోగుల్లో ఈ ఉత్తర్వులపై ఆసక్తి నెలకొంది.

# స్ట్రేంజర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 23వ వార్షిక గణేశోత్సవ వేడుకలు

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 20 (అనంత జనశక్తి)**

సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీ, రోడ్ నంబర్ ఆరులో స్ట్రేంజర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23వ వార్షిక గణేశోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 12న గణనాథుని ఆగమనంతో ప్రారంభమైన వేడుకల్లో సెప్టెంబర్ 14న తొలి పూజ, 18న కుంకుమార్చన, హారతి, 19న గణపతి హోమం మరియు అన్న ప్రసాదం నిర్వహించారు. సెప్టెంబర్ 20న ఉట్టి వేడుకలు, చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 26న లడ్డూ వేలం మరియు గణేష్ శోభాయాత్రతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందాలని స్ట్రేంజర్స్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు కోరారు.




# యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఎండీఆర్ మార్గదర్శకాలు

## తెలుసుకోవాల్సిన 15 ముఖ్యాంశాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

0.4 శాతం ఎండీఆర్ (ఎండీఆర్ ) ఛార్జ్ అనేది ₹2,000 కంటే ఎక్కువ ఉన్న కొన్ని నిర్దిష్ట వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. పీటూపీ (పీ2పీ) విధానంలో ఒకరి నుంచి మరొకరికి జరిగే సాధారణ డబ్బు బదిలీలు పూర్తిగా ఉచితం.

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం.. ₹2,000 వరకు ఉండే చెల్లింపులు, జీరో ఎండీఆర్ కింద ఉండే లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయి. దీనివల్ల దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీల (పీ2ఎం) పై ఎలాంటి ప్రభావం ఉండదు.

ఎండీఆర్ అనేది వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థకు సంబంధించిన రుసుము. దీనిని నేరుగా సాధారణ యూపీఐ వినియోగదారులపై బాదుడుగా వేయడం లేదు.

పీటూపీ ద్వారా ఒక వ్యక్తికి ₹5,000, ₹50,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తం పంపినా ఈ ఎండీఆర్ వర్తించదు.




**₹2,000 లేదా అంతకంటే తక్కువ ఉండే వ్యాపార లావాదేవీలు ఎండీఆర్ పరిధిలోకిరావు. ₹2,000 దాటిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు.. ₹5,000 పై 0.4 శాతం అంటే ₹20, ₹10,000 పై ₹40 ఎండీఆర్ పడుతుంది. అయితే లావాదేవీ మొత్తం ₹75,000 దాటితే మాత్రం ఎండీఆర్ గరిష్ఠంగా ₹300 మాత్రమే ఉంటుంది.**

**సాధారణంగా సగటు పీటూఎమ్ లావాదేవీ విలువ ₹577 మాత్రమే ఉంటుంది. కాబట్టి దాదాపు వ్యాపార లావాదేవీలన్నీ అనుకున్న ₹2,000 పరిమితి కంటే చాలా తక్కువగానే ఉంటాయి.**

**0.4 శాతం లెక్కన చూస్తే.. ₹3,000 వ్యాపార చెల్లింపుకు ₹12, ₹5,000 చెల్లింపుకు ₹20, ₹10,000 లావాదేవీకి ₹40 ఎండీఆర్ అవుతుంది.**

**నిర్దిష్ట పీటూపీఎమ్ (పీ2పీఎం) కేటగిరీ కింద నెలకు ₹1 లక్ష వరకు యూపీఐ క్యూఆర్ (క్యూఆర్) ద్వారా పొందే చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ వర్తిస్తుంది. వారిపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.**

**రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఫ్యూయల్, వ్యవసాయ రంగానికి చెందిన చెల్లింపుల్లో ₹2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతానికి బదులుగా కేవలం ₹5 ఫ్లాట్ ఎండీఆర్ మాత్రమే వర్తిస్తుంది.**

**మ్యూచువల్ ఫండ్స్, సెక్యూరిటీస్, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు సంబంధించిన నిర్దిష్ట చెల్లింపులపై 0.02 శాతం (గరిష్ఠంగా ₹300 వరకు) ఎండీఆర్ వర్తిస్తుంది.**

**ఎండీఆర్ అనేది ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ (ఎన్‌పీసీఐ) వసూలు చేసే పన్ను కాదు. ఇది చెల్లింపుల వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్న సంస్థల మధ్య పంపిణీ అవుతుంది.**

**ఎండీఆర్ అనేది వ్యాపారికి వచ్చే మొత్తం నుంచి మినహాయించుకుంటారు. కస్టమర్ నుంచి దీనిని విడిగా వసూలు చేయరు.**

**యూపీఐ సాంకేతిక వ్యవస్థ సజావుగా నడవడానికి, భవిష్యత్తులో దాని సేవలను మరింత విస్తరించడానికి ఈ విధానం తోడ్పడుతుంది.**

**జీరో-ఎండీఆర్ డిజిటల్ చెల్లింపులను కొనసాగించడానికి ప్రభుత్వం ఆర్థికంగా మద్దతు ఇస్తోంది. అందులో భాగంగానే చిన్న విలువ గల యూపీఐ పీటూఎమ్ లావాదేవీల కోసం మార్చి 2025లో ప్రభుత్వం ₹1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించింది.**

**సాధారణ యూపీఐ వినియోగంపై పూర్తిస్థాయి రుసుము వేయడానికి, దీనికి చాలా తేడా ఉంది. రోజువారీ తక్కువ విలువ గల చెల్లింపులు, వ్యక్తిగత బదిలీలు ఈ ఎండీఆర్ పరిధిలోకి రావు.**

# 'ఇది నీచమైన చర్య'

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ వర్గాలు మండిపడుతున్నాయి. 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమానికి సంబంధించిన వీడియో బీజేపీ నేతల ఆగ్రహానికి దారి తీసింది. ఇండోర్‌లో శనివారం జరిగిన ఆ కార్యక్రమంలో ఓ విద్యార్థి రాహుల్ గాంధీతో వేదిక పంచుకుంటూ.. నరేంద్ర మోదీని అనుకరించారు. అనంతరం మోదీని విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇందులో వీరి వ్యాఖ్యలు, హావభావాలు ప్రధానిని కించపరిచేలా ఉన్నాయని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. రాహుల్‌ను



తీవ్రంగా విమర్శిస్తున్నారు.

రాహుల్ గాంధీ పరిధి దాటి మోదీ వ్యక్తిగత జీవితంపై కామెంట్లు చేశారని బీజేపీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రధానిపై, ఆయన తల్లిపై అసభ్య వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా స్పందించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఆయన 'నీచమైన చర్య'గా పేర్కొన్నారు. ప్రధాని మోదీని, ఆయన తల్లిని అవమానించడానికే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఆరోపించారు. పెద్దలు, తల్లిదండ్రులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నిజమైన భారతీయులకు రాదని ఫైరయ్యారు. ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు వ్యక్తిగత దాడి మార్గం కాదని ప్రహ్లాద్ జోషి ధ్వజమెత్తారు.

ఈ వివాదంపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందిస్తూ.. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. ప్రధాని తల్లిపై ద్వేషపూరిత కామెంట్లు చేయడం క్షమించరాని తప్పని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ వివాదంపై తీవ్రంగా స్పందించారు.

# వచ్చే రోజుల్లో దేశంపై తీవ్ర ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

నష్టం జరిగిన తర్వాత దానిని అధ్యయనం చేయడానికి బదులు, ముందుగానే పర్యవేక్షించేందుకు వీలుగా, ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు వెంటనే సిద్ధం కావాలని సూచించారు.

"సూపర్ ఎల్ నినో: 2026/2"పై ఒక పరిశోధన జెనోడోలో ప్రచురితమైంది. ఎల్‌నినో అనేది సహజ వాతావరణ దృగ్విషయం. పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖకు సమీపంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా పెరుగుతాయి. దీని వల్ల రుతుపవన వ్యవస్థ దెబ్బతింటుది. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రపంచవాతావరణ సంస్థ నివేదిక ప్రకారం.. ఎల్ నినో ఇప్పటికే బలపడుతున్నట్లు చెప్పింది. 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం దాదాపుగా 100 శాతం ఉంటుందని పేర్కొంది.




2026 నవంబర్ నుంచి వచ్చే ఏడాది వరకు భారత్‌లోని అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా వేడి, పొడి వాతావరణం ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. తగ్గిన వర్షపాత నీటి కొరతను పెంచి వ్యవసాయం, అడవులు, పశుపోషణపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలపై వేడి, కరువు ప్రభావం ఉంటుందని అంచనా. ఎడారి ప్రాంతాలు, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే మొక్కలు, జంతువుల మనుగడ కష్టంగా మారొచ్చు. నీటి వనరులపై ఒత్తిడి పడితే అది వ్యవసాయంపై, గ్రామీణ వ్యవస్థపై ఒత్తిడి పెంచొచ్చు. నగరాల్లో వేడి తీవ్రం కావచ్చు. కాంక్రీట్, రోడ్ల కారణంగా పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల కన్నా అధిక వేడి ఉండే అవకాశం ఉంది. అడవుల్లో కార్చిచ్చు వృక్ష, వన్యప్రాణాలకు గణనీయమైన నష్టాన్ని కలిగించొచ్చని అంచనా. వాతావరణ మార్పులు జంతువుల ఆహారం, సంతానోత్పత్తిని దెబ్బతీసే అవకాశాలు ఉన్నాయి.

# విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలి

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

విద్యార్థుల భవిష్యత్, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పిల్లల మానసిక ధైర్యంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కాకినాడ జిల్లాలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విద్యతో సమాజంలో మార్పు సాధ్యమని, వైఫల్యాలను చూసి కుంగిపోకుండా వాటినే విజయానికి బలంగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాకినాడ జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొని విద్యా వ్యవస్థ, ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. విద్య ద్వారా సమాజంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని పేర్కొన్న ఆయన.. విద్యా వ్యవస్థ రాజకీయాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్య, ప్రభుత్వ పాఠశాలలు అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంతో ఇష్టమని తెలిపారు.

ఇదే సందర్భంలో రంపచోడవరం బాలిక ఆత్మహత్య ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు.. పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు ఎంత క్లిష్టంగా అనిపించినా వాటిని పరిష్కరించుకునే మార్గాలు ఉంటాయని, ఇబ్బందులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో మాట్లాడాలని చెప్పారు. పిల్లలు క్షణికావేశంలో తీసుకునే కొన్ని నిర్ణయాలు వారి జీవితాలను మాత్రమే కాకుండా తల్లిదండ్రులకు జీవితాంతం కడుపుకోత మిగిల్చే పరిస్థితి తీసుకొస్తాయని లోకేశ్ అన్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా మంచి సమాజాన్ని నిర్మించే శక్తిగా మారాలని, అందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.



ఏపీ విద్యావ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే దేశంలోనే నంబర్ వన్‌గా ఏపీ విద్యావ్యవస్థ మారుతుందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. క్లాస్ రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యమని.. అందుకే విద్యాశాఖ ఎంచుకున్నానని పేర్కొన్నారు. కాకినాడలో మంత్రి నారా లోకేశ్ ఆదివారం పర్యటించారు. చాగంటి కోటేశ్వరరావు గోశాల ప్రాంగణంలో విద్యార్థులతో వ్యక్తిత్వ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు.

**ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని లోకేశ్ ప్రస్తావించారు. ఇంటర్‌లో కూడా 10 వేల మంది విద్యార్థుల అడ్మిషన్స్ పెరిగాయని తెలిపారు. చాగంటి ద్వారా విలువల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు దూరంగా విద్యావ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. యూనిఫాం, బుక్స్, బ్యాగ్స్, బెల్ట్స్ , షూస్ ఎక్కడా నో పొలిటికల్ పార్టీ కలర్స్ ఉండకూడదనే ఎక్కడా కూడా ముఖ్యమంత్రి, తన ఫొటోలు ముద్రించలేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని లోకేశ్ ఉద్ఘాటించారు. 2019లో పోటీ చేసి ఓడిపోయానని.. తొలిసారి ఫెయిల్ అయినా.. నిరాశకు లోను కాలేదని చెప్పారు. చాలామంది మంగళగిరి టీడీపీ సీటు తనకు సరికాదని... టీడీపీకి కంచుకోట లాంటి సీట్లలో పోటీ చేయాలని సలహా ఇచ్చారని అన్నారు. తాను పడిపోయిన చోటే నిలబడతానని ఛాలెంజ్ చేసి చూపించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.**

# పొదుపుతోపాటు సామాజిక భద్రత




తప్పనిసరి ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)వేతన పరిమితిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచడాన్ని ఈపీఎఫ్‌వో తెలంగాణ జోనల్ కార్యాలయం, రాష్ట్రంలోని ప్రాంతీయ కార్యాలయాలు స్వాగతించాయి. ఈనెల 17 నుంచి అమల్లోకి వచ్చిన ఈ వేతన పరిమితి పెంపుదల చట్టబద్ధ సామాజిక భద్రతా స్వరూపంలో ఒక ముఖ్యమైన విస్తరణతోపాటు తప్పనిసరి ఈపీఎఫ్ఓ పరిధిలోకి దేశవ్యాప్తంగా మరో 51 లక్షల మందికిపైగా ఉద్యోగులను తీసుకువచ్చే గొప్ప మార్పని తెలంగాణ జోనల్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

తప్పనిసరి ఈపీఎఫ్‌వో పరిమితి సవరణ చివరిసారి 2014 సెప్టెంబర్‌లో జరిగిందని, అప్పుడు పరిమితిని రూ.15,000కు పెంచడం జరిగిందని ఈపీఎఫ్‌వో పేర్కొన్నది. ఆ తర్వాత వేతనాలు, ఆదాయాలు, కనీస వేతనాలు, జీవన వ్యయం గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో వ్యవస్థీకృత రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. వేతన పరిమితి పెంపుదలతో తప్పనిసరి ఈపీఎఫ్ పరిధిలోకి రూ.15,000రూ.25,000 వేతనాలు పొందుతున్న ఉద్యోగులు కొత్తగా వస్తారని, ఇది వారికి మరింత ఎక్కువ సామాజిక భద్రతను కల్పిస్తుందని ఈపీఎఫ్‌వో తెలిపింది.

ప్రావిడెంట్ ఫండ్ ఖాతా అంటే కేవలం పొదుపు ఖాతా మాత్రమే కాదని, ఈపీఎఫ్‌వో నిర్వహించే మూడు ప్రధాన పథకాల ప్రయోజనాలు కూడా పొందవచ్చని తెలిపింది. దీర్ఘకాలిక రిటైర్‌మెంట్ పొదుపును సమకూర్చే ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్), పింఛను సంబంధించిన సామాజిక భద్రతా రక్షణను కల్పించే ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్), ఉపాధితో ముడిపడిన బీమా రక్షణ కల్పించే ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ బీమా పథకం(ఈడీఎల్ఐ) వంటి ప్రయోజనాలకు కొత్తగా ఈపీఎఫ్ఓ పరిధిలోకి వచ్చే సభ్యులు అర్హులవుతారని ఈపీఎఫ్ఓ పేర్కొన్నది..

అందువల్ల వేతన పరిమితి పెంపు ఉద్యోగికి చెందిన శాలరీ స్లిప్పులో నెలవారీ పీఎఫ్ చెల్లింపు మొత్తంగా మాత్రమే గాక రిటైర్‌మెంట్ పొదుపు, పింఛన్ రక్షణ, బీమా భద్రతను కల్పించే విస్తృత సామాజిక భద్రతా వ్యవస్థగా ప్రతిబింబిస్తుందని పేర్కొన్నది.. ప్రతినెలా తప్పనిసరిగా ఉద్యోగి జీతం నుంచి చెల్లించే పీఎఫ్ మొత్తంతోపాటు యాజమాన్యం చెల్లించే మొత్తం కూడా కలుపుకుంటే రిటైర్మెంట్ సమయానికి వడ్డీతో కలుపుకుని పెద్దమొత్తంగా చేతికి అందుతుందని ఈపీఎఫ్‌వో తెలిపింది. జీవితంలో ఎదురయ్యే అస్థిర పరిస్థితులకు సామాజిక భద్రతగా పీఎఫ్ చెల్లింపు నిలుస్తుందని పేర్కొన్నది. ఈ సందర్భంగా అర్హులైన ఉద్యోగులను ఈపీఎఫ్‌వో పరిధిలోకి తీసుకురావడంలో యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# దసరా పండుగకు దక్షణమధ్య రైల్వే ఏర్పాట్లు



దసరా పండుగ దగ్గరపడుతుండటంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణమధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లిశ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా చర్లపల్లినాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

చర్లపల్లిశ్రీకాకుళం మధ్య నడిచే 16 ప్రత్యేక రైళ్ల షెడ్యూల్ ఈ విధంగా ఉన్నది. రైలు నంబర్ 07037 (చర్లపల్లిశ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతోపాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళంచర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 తేదీల్లో, నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

వీటితోపాటు చర్లపల్లినాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# యూకేలో భారత సంతతి వ్యక్తిపై యెమెన్ జాతీయుడి దాడి..!



యూకే లో భారత సంతతికి చెందిన సిక్కు బస్సు డ్రైవర్ పై అమానుష దాడి జరిగింది. 33 ఏళ్ల యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్‌పై దాడిచేసి అతని బస్సును దొంగిలించాడు. ఆ బస్సును రాంగ్ రూట్‌లో నడుపుతూ బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం టెల్ఫోర్డ్‌లోని మేడ్లీ ప్రాంతంలో ఉన్న కోర్ట్ స్ట్రీట్‌లో చోటుచేసుకుంది. ఈ దాడి మొత్తం కెమెరాలో రికార్డ్ అవ్వగా, ఆ వీడియో ఇప్పుడు కలకలం రేపుతోంది.

అలీ బల్హాద్ అనే యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్ గడ్డాన్ని పట్టుకుని లాగడం, అతని తలతో డ్రైవర్ తలను బలంగా బాదడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక మహిళ.. "అతడిని ఎందుకు అలా కొడుతున్నావ్..?" అని అడగటం కూడా వీడియోలో వినిపించింది. బాధితుడైన డ్రైవర్.. "దయచేసి పోలీసులకు ఫోన్ చేయండి. ఈ వ్యక్తిని నా దగ్గరి నుంచి తీసుకుపోండి" అని ఆమెను వేడుకున్నాడు. అయినా ఆగని నిందితుడు, బస్సులోని కొన్ని భాగాలను ధ్వంసం చేశాడు.

బస్సు క్యాబిన్‌లోని ఒక లైట్‌ను బయటకు లాగి.. దానితో డ్రైవర్‌పై దాడి చేస్తానని బెదిరించాడు. బస్సును తనకు ఇచ్చేయాలని పదేపదే డిమాండ్ చేశాడు. దాదాపు నిమిషంపాటు ఈ దాడి కొనసాగింది. చివరకు నిందితుడు బల్హాద్ డ్రైవర్‌ను బలవంతంగా బస్సులో నుంచి కిందకు తోసేసి, స్టీరింగ్ ఎక్కాడు. ఆ తర్వాత బస్సును రాంగ్ రూట్‌లో పార్క్ వే నుంచి హై స్ట్రీట్ వైపు వేగంగా నడుపుతూ పలు వాహనాలను ఢీకొట్టాడు. ఆ సమయంలో ఒక మహిళ 'ఓ మై గాడ్' అని అరుస్తూ.. పక్కకు జరగమని ప్రజలను హెచ్చరిస్తూ బస్సు వెనుక పరిగెత్తడం వీడియోలో కనిపించింది.

ఈ ఘటనపై సాయంత్రం 6:37 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న 10 నిమిషాల్లోనే వెస్ట్ మెర్సియా పోలీసులు, సాయుధ బలగాలతో సహా ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బస్సును నిలిపివేసి.. దోపిడీ, ప్రమాదకరంగా వాహనం నడపడం వంటి ఆరోపణలపై అలీ బల్హాద్‌ను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని, వేరే ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని పోలీసులు తెలిపారు.

సమాచారం అందిన వెంటనే మా అధికారులు స్పందించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. డిటెక్టివ్ సార్జెంట్ క్రైగ్ లానీ మాట్లాడుతూ.. ఈ ఘటన స్థానికంగా ఆందోళన కలిగించిందని, అయితే పోలీసులు వేగంగా చర్యలు తీసుకున్నారని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఘటనను చూసిన వారు లేదా తమ వద్ద డాష్‌క్యామ్, సీసీటీవీ ఫుటేజ్ ఉన్నవారు దర్యాప్తుకు సహకరించాలని పోలీసులు కోరారు. గత వారం రోజులుగా టెల్ఫోర్డ్ ప్రాంతంలోనే ఉంటున్నట్లు భావిస్తున్న నిందితుడు అలీ బల్హాద్‌పై పోలీసులు తీవ్రమైన అభియోగాలు నమోదు చేశారు.

# 'వ్యవస్థ' గుప్పిట్లో దేశం: రాహుల్ గాంధీ

ఇండోర్: యావద్దేశం 'వ్యవస్థ' గుప్పిట్లో ఉందని, విద్యార్థులు ప్రశ్నించడాన్ని అది కోరుకోవట్లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశం నుంచి ద్వేషాన్ని తరిమిగొట్టగలిగేది 'అంధ భక్తులు' కాదని, ఆ పని కేవలం విద్యార్థులవల్లే అవుతుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపాలకు మద్దతుగా నిలుస్తున్న వారిని అంధ భక్తులుగా ఆయన అభివర్ణించారు. శనివారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. రాహుల్ ప్రసంగిస్తూ.. ఏ దేశానికైనా యువతే భవితవ్యమని, వారు లేకుండా దేశాలేవీ బలపడలేవని చెప్పారు. ''అదానీ, అంబానీ, జై షా సహా వ్యవస్థ గురించి విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కానీ వారిని 'అంధ భక్తులు' వ్యతిరేకిస్తున్నారు. కుతూహలం, ప్రేమ, అణకువ, సహనం, నిజాయతీ.. ఇవన్నీ విద్యార్థుల్లో ఉంటాయి. అంధ భక్తుల్లో ఇవేవీ ఉండవుగానీ ద్వేషాన్ని చిమ్ముతుంటారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లక్ష పాఠశాలలు మూతపడ్డాయి. యూపీఏ సర్కారు ఉన్నప్పుడు విద్య కోసం 4.6% బడ్జెట్‌ను కేటాయిస్తే ఇప్పుడు అది 2.6 శాతానికి పడిపోయింది'' అని రాహుల్ విమర్శించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ భాగవత్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీలు వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు.



# కాలుష్య కారకులే నిందలేయడమా?

దిల్లీ: భారత్‌తో పోల్చి చూసినప్పుడు.. అభివృద్ధి చెందిన దేశాలు వెలువరించే తలసరి కర్బన ఉద్గారాలు 6 రెట్లు ఎక్కువని, ప్రపంచ వేదికలపైనా దీనిని గట్టిగా చెబుతున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ వాతావరణ మార్పులకు వర్ధమాన దేశాలదే బాధ్యతన్నట్లు నిందిస్తుండటం అసమంజసమని అభిప్రాయపడ్డారు. పర్యావరణం, వాతావరణ మార్పులపై రెండ్రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును శనివారం దిల్లీలో ఆయన ప్రారంభించారు. ''ప్రపంచంలో తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చాలా స్వల్పమనేది చారిత్రక సత్యం. పారిస్ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకంటే ముందే చేరుకున్న జీ 20 దేశం భారత్ మాత్రమే'' అని మోదీ వివరించారు.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అనేవి కలిసి సామరస్యంగా ఎలా ముందుకు వెళ్లగలవనేదే ఇప్పుడు దేశంలో న్యాయస్థానాల ముందున్న ప్రశ్న అని చెప్పారు. పర్యావరణ న్యాయాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు మర్రిచెట్టులా నిలుస్తోందన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు ఉద్యోగావకాశాలు: మోదీ

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నైపుణ్య కార్యక్రమాలు, రూ.లక్ష కోట్ల ఉపాధి ప్రోత్సాహక పథకాలవల్ల 2 కోట్ల మంది యువతీయువకులు సంఘటిత కార్మికశక్తిగా మారనున్నారని వివరించారు. శనివారం దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో 51వేలకుపైగా నియామక పత్రాలను పంపిణీ చేశారు. వారిని ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు.





# డ్రైఫ్రూట్స్ తింటూ కరువు పరిస్థితులపై సమీక్ష

కరువు పరిస్థితులపై సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు డ్రైఫ్రూట్స్ తింటూ కనిపించడం బీజేపీ పాలిత మహారాష్ట్రలో దుమారం రేపింది. మరాఠ్వాడా ప్రాంతంలో దారుణమైన కరువు పరిస్థితులపై నాందేడ్‌లో వ్యవసాయ మంత్రి దత్తాత్రేయ భామే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు జీడిపప్పు, బాదం లాంటి డ్రై ఫ్రూట్స్ పెట్టారు. అధికారులు ఓ వైపు కరువు పరిస్థితులపై వివరిస్తుంటే.. ఇంకోవైపు మంత్రులు అతుల్ సావే, మేఘనా బోర్డికర్, అలాగే కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు జీడిపప్పు, బాదం తింటున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనిపై శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే అంబాదాస్ దాన్వే తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి, కనీసం సానుభూతి లేకుండా వారి తీరు ఉందన్నారు. దీనిపై సీఎం ఫడ్నవీస్ స్పందిస్తూ.. ఇలాంటి సున్నితమైన అంశాలపై చర్చిస్తున్నప్పుడు సున్నితత్వాన్ని ప్రదర్శించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు.

# మోదీ బర్త్‌డేకు గైర్హాజరైన విద్యార్థులకు రూ.500 జరిమానా!




ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే దీపారాధన కార్యక్రమానికి గైర్హాజరైన విద్యార్థులను ఐఐఎం జమ్ము శిక్షిస్తున్నదని కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసీర్ హుస్సేన్ ఆరోపించారు. ఈ కార్యక్రమానికి హాజరుకాని విద్యార్థులు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదా రూ.500 జరిమానా చెల్లించాలని ఐఐఎం జమ్ము విద్యార్థి కౌన్సిల్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. దీనికి శుక్రవారం డెడ్‌లైన్ విధిస్తూ జారీ చేసిన నోటీస్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.

అసలు ప్రధాని పుట్టిన రోజు వేడుకకు విద్యార్థులు తప్పనిసరిగా ఎందుకు హాజరుకావాలని ఆయన ఎక్స్‌లో ప్రశ్నించారు. 'ఇది ఐఐఎంలో ఏర్పాటు చేసిన ఒక విద్యాపరమైన బాధ్యతా? లేదా మోదీ ప్రచారాన్ని క్యాంపస్‌లో నిర్వహించడం తప్పనిసరి కార్యక్రమమా? విద్యా సంస్థల్లోని విద్యార్థుల్లో స్వతంత్ర భావాలను పెంపొందించాలే తప్ప వారిని రాజకీయ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించడం, లేకపోతే జరిమానాలు విధిస్తామని బెదిరించడం తగదు.

బీజేపీ ప్రచార విన్యాసాలను మన అత్యున్నత విద్యాసంస్థలకు దూరంగా ఉంచాలి' అని ఆయన అన్నారు. కాగా దీనిపై ఐఐఎం జమ్ము స్టూడెంట్ అఫైర్స్ చైర్‌పర్సన్ బ్రిగేడ్ నీరజ్ సోని వివరణ ఇస్తూ కార్యక్రమానికి హాజరుకాని ఏ విద్యార్థికి కూడా జరిమానా విధించ లేదని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుక మాదిరిగానే ఇది కూడా సాధారణంగా తీసుకునే చర్యేనని పేర్కొన్నారు.

# ఆస్తిపన్నుతో పాటు సాఫ్ట్‌వేర్ చార్జీ




'పౌరులపై ఎన్నిరకాల పన్నులు వేసి పీడించవచ్చు?' అనే అంశంపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రీసెర్చి చేస్తున్నట్టు కన్పిస్తున్నది. ఐదు నగర కార్పొరేషన్లతో ఉన్న గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)ఇళ్ల యజమానుల నుంచి కొత్తరకం పన్నును వసూలు చేయడం ప్రారంభించింది. వారు ఇక నుంచి ఆస్తిపన్నుతో పాటు రూ.200 'సాఫ్ట్‌వేర్ చార్జీ' కూడా చెల్లించాలి. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకుండానే ఆర్థిక సంవత్సరం మధ్యలో ప్రజలపై నిశ్శబ్దంగా విధిస్తుండటం పట్ల జీబీఏపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వాణిజ్య భవనాలపై ఈ చార్జీ రూ.1000 ఉండచ్చునని సమాచారం. కాగా, జీబీఏ చర్యను విపక్ష బీజేపీ, జేడీ(ఎస్)లు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇది పట్టపగలు దోపిడీ అని వ్యాఖ్యానించాయి.

# ప్రారంభించాల్సింది నేను కాదు.. ఆయన!

కొట్టాయం: పనులు చేయించింది, నిధులు సాధించింది ఎవరైనప్పటికీ ప్రారంభోత్సవ గౌరవం తాజా ప్రజాప్రతినిధికి దక్కడం సాధారణమే. కానీ కేరళలో దీనికి భిన్నమైన ఘటన జరిగింది. తాను ఇటీవలే ఎమ్మెల్యేనైనా.. ఓ ఊరి వంతెన సాకారం అయ్యేందుకు మునుపటి ఎమ్మెల్యే కారణం కాబట్టి ఆయనే దానిని ప్రారంభించాలని పట్టుబట్టి మరీ అలాగే చేయించారు. పూజార్ నియోజకవర్గం నుంచి ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన సెబాస్టియన్ కులథుంకాల్‌ను (ఎల్‌డీఎఫ్‌లో భాగమైన కేరళ కాంగ్రెస్‌ఎం నేత) కాంగ్రెస్ అభ్యర్థి ఎం.జె.సెబాస్టియన్ ఓడించారు. ఎరుమేలిఅమకున్ను మధ్య వంతెన నిర్మించేందుకు రూ.80 లక్షల నిధులను నియోజకవర్గ అభివృద్ధి నిధి నుంచి కులథుంకాల్ ఇదివరలో మంజూరు చేశారు.

**ప్రారంభోత్సవ ఏర్పాట్లు జరుగుతుండగా సెబాస్టియన్ స్థానిక అధికారుల్ని ఒప్పించి.. మాజీ ఎమ్మెల్యేను శుక్రవారం నాటి కార్యక్రమానికి ఆహ్వానించేలా చూశారు. వంతెన పనికి పూర్తి ఖ్యాతి ఆయనదేనని సభాముఖంగా చెప్పారు. "నాకు ఇది అవమానమో, అగౌరవమో కాదు. అలాంటి ఆలోచనే నాకు రాదు. నిధులు ఇచ్చినందుకు ఆయన్ని గౌరవించాల్సిందే. రాజకీయమంటే అదే. సమాజాభివృద్ధికే రాజకీయాలు ఉండాలి. అభివృద్ధి పనులపై వాస్తవాలేమిటో ప్రజలకు తెలియాలి" అని సెబాస్టియన్ పేర్కొన్నారు. తర్వాత వంతెనను కులథుంకాల్ లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకంపై సెబాస్టియన్ పేరు కూడా లేదు.**




# అంకెల వెనుక అసలు నిజం!

ఆగస్టు 31న, కేంద్ర ప్రభుత్వం, దేశంలో సంపద పెరుగుదలకి సంబంధించి, కొన్ని గణాంకాలు విడుదల చేసింది. వాటి సారాంశం ఏమిటంటే: 'కిందటి సంవత్సరం (2025లో), ఏప్రిల్ నెలకీ–జూన్ నెలకీ మధ్య, దేశంలో (డొమెస్టిక్).. వస్తువుల రూపంలో గానీ, 'సేవల' రూపంలో గానీ, తయారైన ఉత్పత్తి ('ప్రొడక్ట్')కి వచ్చిన మొత్తం డబ్బు ('గ్రాస్') విలువ కన్నా, ఈ 2026వ సంవత్సరంలో, అవే 3 నెలల్లో వచ్చిన మొత్తం డబ్బు విలువ (జి.డి.పి.) ఎక్కువ' అని ఆ లెక్కలు చెప్పాయి. అసలు డబ్బు లెక్కలుకట్టే పనికి ప్రభుత్వంలో ఒక డిపార్టుమెంటు ఉంటుంది; గణాంకాలశాఖ అనో, ఆర్థికశాఖ అనో, ఏదో ఒక పేరుతో! ఆ శాఖలో వున్న ఆర్థికశాస్త్రవేత్తలు ప్రతి ఏటా, దేశం మొత్తంలో 3 నెలల్లో జరిగిన మొత్తం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు సేకరించి, వాటిని తాము సరైనది అనుకున్న పద్ధతి ('మెథడాలజీ') ప్రకారం అర్థం చేసుకుని, ఆ లెక్కల్ని పత్రికలకీ, టీవీ చానళ్లకీ విడుదల చేస్తారు. అలా, ఇటీవల బైటికి వచ్చిన లెక్కల్ని చూసి, దేశ ప్రధాని తెగ మురిసిపోతూ చెప్పిన మాటల్లో కొన్ని: "నా ప్రభుత్వ పాలనలో, ఎంత ఆర్థికాభివృద్ధి జరిగిందో చూశారా? కానీ, ప్రతిపక్షం వాళ్లు ఉన్నారు చూశారూ? వాళ్లు నిరాశావాదులు! వినాశనం జరుగుతుందని జోస్యం చెప్పేవాళ్లు! వాళ్లకు ఈ అభివృద్ధి మింగుడుపడడం లేదు. వినాశనాన్ని కోరే ప్రతిపక్షాలు నశించాయి లెండి! భారతదేశం మాత్రం వికసించింది." ('డూమ్ సేయర్స్ ఆర్ డూమ్డ్! ఇండియా బ్లూమ్డ్!')– ఇలా సాగింది ప్రధానమంత్రి ఆత్మస్తుతీ, పరనిందా!

ప్రధాని ఇలా అంటే, ప్రతిపక్షాలు ఊరుకుంటాయా? వారికీ వారి పడికట్టు పదాలు ఉంటాయిగదా? వారేం అన్నారంటే.. "ప్రభుత్వం చెప్పే జి.డి.పి.కి అర్థం: 'జి' అంటే 'గ్రేట్లీ', 'డి' అంటే 'డిస్టార్టెడ్', 'పి' అంటే 'పిక్చర్'! ('గొప్పగా వక్రీకరించిన చిత్రం') అనీ; ప్రభుత్వం చెప్పే లెక్కలన్నీ, గణాంక క్రీడా విన్యాసాలు అనీ; అంకెల్ని తారుమారు చేయడం అనీ; కావాలని తయారుచేసిన సమాచారం అనీ– ఇలా సాగాయి ప్రతిపక్ష పార్టీల పదాల విన్యాసాలు. ప్రభుత్వంతో విభేదించే వాళ్లు ఇంకా ఇలా ఆశ్చర్యపోతున్నారు: 'గత కొన్ని సంవత్సరాలుగా, ప్రపంచంలో రెండుచోట్ల పెద్ద యుద్ధాలు జరుగుతూవుంటే, అనేక దేశాలలో వృద్ధిరేటుకి ఆటంకాలు ఎదురవుతూవుంటే, ఇక్కడ వృద్ధి రేటు గతం కంటే కూడా పెరిగిపోవడం ఎలా సాధ్యం?' అని!

అయితే, అటు అధికార పక్షం అయినా, ఇటు ప్రతిపక్షం అయినా, ప్రతిసారీ ఇలాగే, చెప్పిందే చెబుతారనుకోండి. అధికారంలో వున్నప్పుడేమో, 'చూశారా, మా పాలనలో ఎంత ఆర్థికాభివృద్ధిని సాధించామో?' అంటారు. అధికారంలో లేనప్పుడేమో, 'ఏడిసింది మీ అభివృద్ధి. నిరుద్యోగాన్నీ, దారిద్ర్యాన్నీ, ధరల పెరుగుదలనీ తగ్గించని అభివృద్ధి ఏమి అభివృద్ధి?' అంటారు. అలాగే, ఆ పక్షాల ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా, జి.డి.పి. లెక్కల విషయంలో, పరస్పరం వ్యతిరేకమైన వాదనలు చేస్తారు. ఒక పక్షం ఆర్థికవేత్తలేమో, "ఫ్యాక్టరీలో తయారవడానికి ఎంత డబ్బు అయిందో, దాన్నిబట్టి మీరు లెక్కపెట్టలేదు. ఆ ఉత్పత్తికే, చివరికి అమ్మకాలు అయ్యాక ఎంత డబ్బు వచ్చిందో, ఆ పద్ధతిలో లెక్క పెట్టారు. అందుకే, ఎక్కువ ఉత్పత్తి జరిగినట్టు కనిపిస్తున్నది" అని వాదన.

దానికి అధికారపక్షం వాళ్లేమో, "తేడా ఏమీ లేదు. ఉదాహరణకి, ఒక మనిషి బరువుని 150 పౌండ్లు అన్నా, 70 కిలోలు అన్నా పెద్ద తేడా అవుతుందా? ఒక రకం కొలతలో అంకెలు ఎక్కువగానూ, ఇంకో రకం కొలతలో అంకెలు తక్కువగానూ ఉండడం వల్ల మీకు అలా అనిపిస్తుంది" అని వాళ్లకి మాత్రమే అర్థమయ్యే పోలిక తెస్తారు. కానీ, రెండు రాజకీయ పక్షాలూ, వారి ఆర్థికవేత్తలూ కూడా, శ్రామిక ప్రజలకు అసలు రహస్యం చెప్పరు. అసలు రహస్యం తెలుసుకోవాలంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, శ్రామికవర్గ ప్రయోజనాల దృష్టితో, పరిశోధించిన మార్క్స్ వైపు కళ్లు తిప్పవలిసిందే! పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే జి.డి.పి. ('స్థూల దేశీయ ఉత్పత్తి') అనే మాట మార్క్స్ కాలంలో లేదు. మార్క్స్ పోయిన తర్వాత ఎప్పుడో 50 ఏళ్లకి, ఒక పెట్టుబడిదారీ ఆర్థికవేత్త ఆ మాటని ప్రవేశపెట్టాడు. అయితే, ఆ మాట, 'శ్రమ దోపిడీ' అనే అసలు రహస్యాన్ని మరుగుపరిచి, పెట్టుబడిదారులకి లాభాల రూపంలో ప్రతి 3 నెలలకీ, లేదా సంవత్సరానికి, కొత్తగా సమకూరిన సంపద ఎంతా?– అనే డబ్బులెక్కల మీదే దృష్టి పెడుతుంది. 'ఆ తయారైన ఉత్పత్తి శ్రామిక జనాలకు ఎంత వరకు అందిందీ, ఆ ఉత్పత్తుల గుట్టల్లో ఆరోగ్యానికి హాని చేసే సిగిరెట్లూ, బ్రాందీ విస్కీలూ వంటి వస్తువులు ఎన్ని ఉన్నాయో; తుపాకులూ బాంబులూ, యుద్ధ ట్యాంకులూ, ఖండాంతర క్షిపణులూ లాంటి మారణాయుధాలు ఎన్నివున్నాయో– ఇలాంటి సంగతులు ఏవీ పట్టవు వృద్ధి రేటును లెక్కపెట్టేవారికి. 'ఎన్ని లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థో మనది!'– అని గప్పాలు కొట్టుకోవడానికి పనికి వచ్చే మాటలే మాట్లాడతారు ప్రభుత్వాధినేతలూ, వారి ఆర్థికవేత్తలూ!

పెట్టుబడిదారుల ఉమ్మడి వ్యవహారాల్ని చూసే కమిటీగా పనిచేసే ప్రభుత్వం, ఉత్పత్తి విలువలో పెరుగుదలను చూపించి, జబ్బలు చరుచుకుంటోంది. ఆ పెరుగుదల ఎవరి శ్రమల విలువ వల్ల జరిగిందో మాత్రం ఆర్థికవేత్తలూ చెప్పరూ, ప్రభుత్వమూ చెప్పదు. అది మనం తెలుసుకోవాలి. 'ఆ ఆర్థిక విషయాల గోల మనకెందుకు?' అని ఊరుకోకూడదు. ఎందుకంటే, ఆ ఆర్థిక విషయాలే మన నిత్యజీవితాల్ని శాసిస్తాయి, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ!

మార్క్స్ సిద్ధాంతం ప్రకారం చూసినప్పుడు, ఏ కాలంలోని ఉత్పత్తి (జి.డి.పి) విలువ అయినా, 3 భాగాలుగా వుంటుంది. (1) ఉత్పత్తి సాధనాల మీద పెట్టిన డబ్బు. ఇది, పెట్టినంతే వెనక్కి తిరిగి వస్తుంది కాబట్టి, ఇది 'స్థిర' పెట్టుబడి. (2) సాధనాల్ని ఉపయోగించి, ఉత్పత్తి చేసే శ్రామికులు పొందే జీతాల మీద పెట్టే డబ్బు. (3) ఈ డబ్బుని జీతాలుగా తీసుకునే కార్మికులు, జీతాల విలువకన్నా అదనంగా విలువని (డబ్బుని) ఇస్తారు కాబట్టి, జీతాల మీద పెట్టే డబ్బుని 'అస్థిర' పెట్టుబడి అంటారు.

అంటే, జి.డి.పి. అనే దానిలో స్థిర పెట్టుబడి+అస్థిర పెట్టుబడి+అదనపు విలువ ఉంటాయి. ఇదీ, జి.డి.పి. అసలు రహస్యం. మరి, ఆర్థికవేత్తలు ఈ రహస్యం గురించి ఎందుకు చెప్పరు? ఎందుకంటే, వాళ్లు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు కాబట్టి! వాళ్లు చెప్పేదే గొప్ప ఆర్థిక శాస్త్రంగా ఎందుకు చలామణీ అవుతున్నది? దీనికి జవాబు తన 'పెట్టుబడి' పుస్తకంలో, ఒక ముందుమాటలో, మార్క్స్ ఇలా చెప్పాడు: "వర్గ పోరాటం, ఇంకా తగినంతగా పైకి కనిపించనంత కాలమూ, లేదా, అది అక్కడక్కడా, అప్పుడప్పుడూ మాత్రమే బయట పడుతున్నంత కాలమూ, రాజకీయ ఆర్థికశాస్త్రం ఒక శాస్త్రంగా చలామణీ అవుతుంది." ఈ సంగతి అసలు ఉత్పత్తిదారులైన శ్రామిక ప్రజలు తెలుసుకోగలిగినప్పుడు, ఇప్పుడున్న అధికార–ప్రతిపక్ష రాజకీయ పార్టీలూ, వారి ఆర్థిక శాస్త్రవేత్తలూ చెప్పే దాని వెనక ఉన్న అసలు సత్యం బోధపడుతుంది.

# అవకాశాల కల్పనే ప్రగతికి ఆలంబన

**ఏటా లక్షలమంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్నారు. అలా పెద్దమొత్తంలో డబ్బులూ, ప్రతిభా నైపుణ్యాలు తరలిపోతున్నాయి. కానీ యుద్ధాలు, కఠిన వీసా విధానాలు విదేశీ చదువుల మార్గాన్ని, స్థిరపడే అవకాశాల్ని అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. మరోవైపు, భారతీయ విశ్వవిద్యాలయాల స్థాయి కూడా పెరుగుతోంది. విదేశీ వర్సిటీలు సైతం ఇండియాకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ చదువుల విషయంలో అందరూ పునరాలోచన చేయాలి.పిల్లల్ని విదేశాల్లో చదివించాలనేది చాలామంది తల్లిదండ్రుల ఆరాటం. అప్పులకూ వెనకాడరు. పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఆశతో తల్లిదండ్రులు చేసే ఈ త్యాగం గొప్పదే. అయితే, విదేశీ చదువులు మాత్రమే విజయానికి మార్గాలవుతాయా? ప్రపంచ పరిస్థితులు ఇప్పటికీ ఒకప్పటిలాగే ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా పరిస్థితులు మారుతున్నాయి. విదేశీ విద్యకు వెళ్లే మార్గాలు, వీసా విధానాలు, అక్కడి ఉద్యోగ అవకాశాలు వంటివన్నీ మారాయి. అదే సమయంలో మన ఉన్నత విద్యారంగంలోనూ వేగంగా మార్పులు కనిపిస్తున్నాయి. అందుకే విదేశీ చదువులపై నిర్ణయం తీసుకునే ముందు స్వదేశంలో మారుతున్న వాస్తవ పరిస్థితులను కూడా పరిశీలించడం అవసరం.**



గణాంకాలు చెప్పేదేంటి?

దేశాంగశాఖ గణాంకాల ప్రకారం 2024లో సుమారు 13.35 లక్షల భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుకున్నారు. చదువుల కోసం భారత్ నుంచి ఏటా సుమారు రూ.29వేల కోట్లు విదేశాలకు వెళ్తున్నట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు సూచిస్తున్నాయి. నీతిఆయోగ్ ఇటీవలి నివేదిక ప్రకారం భారత ప్రభుత్వం ఉన్నత విద్యకు కేటాయించే బడ్జెట్ లో దాదాపు 53 శాతానికి సమానమైన మొత్తం విదేశీ చదువుల కోసం బయటకు వెళ్తోంది. విదేశీ వర్సిటీలో విద్య, తర్వాత ఉద్యోగం, అక్కడే స్థిరపడటం అనేది ఇప్పటి దాకా చాలా కుటుంబాల ప్రణాళిక. కానీ, ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఆ మార్గం గతంలో మాదిరిగా తేలికగా లేదు. కెనడా ప్రభుత్వం 2024లో స్టూడెంట్ పర్మిట్ల సంఖ్యను దాదాపు సగానికి తగ్గించింది. ఫలితంగా భారత విద్యార్థుల సంఖ్య ఒక్క ఏడాదిలోనే 41శాతం తగ్గిపోయింది. అమెరికాలో వీసా విధానాలు కఠినతరమయ్యాయి. హెచ్1బీ వీసా ఫీజులు పెరిగాయి. విద్యార్థి వీసాల పరిశీలన మరింత కఠినంగా మారింది. యూకే, ఆస్ట్రేలియా కూడా వీసా ఖర్చులు పెంచి, కొన్ని పోస్ట్‌స్టడీ అవకాశాలను పరిమితం చేశాయి. ఫలితంగా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్యపై ప్రభావం పడుతోంది. మరోవైపు, భారతీయ వర్సిటీలు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో క్రమంగా మెరుగవుతున్నాయి. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2026 ప్రకారం ఐఐటీ దిల్లీ ప్రపంచంలో 123వ స్థానం, ఐఐటీ మద్రాస్ 180వ స్థానం పొందాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఐఐటీ దిల్లీ ప్రపంచంలో 26వ స్థానం దక్కించుకోవడం విశేషం. వ్యాపార విద్యలో ఐఐఎం అహ్మదాబాద్ ప్రపంచ టాప్30లో స్థానం సంపాదించింది. ఇప్పటిదాకా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 54 భారతీయ వర్సిటీలు చోటుసంపాదించాయి. అమెరికా, యూకే, చైనా తర్వాత నాలుగో స్థానంలో ఇండియా నిలవడం గమనార్హం. ప్రైవేట్ వర్సిటీలు కూడా ఈ మార్పులో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచస్థాయి విద్యాసంస్థల్లో చదివిన అధ్యాపకులను నియమించడం, పరిశ్రమలతో బలమైన అనుబంధం నెలకొల్పడం, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, విదేశీ వర్సిటీలతో అకడమిక్ సహకారం పెంచడం వంటి చర్యలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాయి. ప్లేస్‌మెంట్ అవకాశాలు, నైపుణ్య కోర్సులు కూడా అనేక ప్రైవేట్ యూనివర్సిటీల ప్రత్యేకతలుగా మారాయి. ఇటీవల ప్రపంచస్థాయి వర్సిటీల్లో కొన్ని ఇండియాలో క్యాంపస్‌ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో నాణ్యమైన ఉన్నత విద్యావకాశాలను మరింతగా విస్తరించగలిగితే ప్రతిభా నైపుణ్యాలను దేశంలోనే నిలబెట్టుకోవడం సాధ్యమే.

**మార్పును ముందుకు తీసుకెళ్లాలి...**

నీతి ఆయోగ్ విశ్లేషణ ప్రకారం, ఒక విదేశీ విద్యార్థి ఇండియాకు వస్తే, సుమారు 25మంది భారతీయ విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారు. అంటే, మన దేశంలోని ప్రతిభాపాటవాలు, మన పన్నులతో రూపుదిద్దుకున్న నిపుణ మానవ వనరులు ఇతర దేశాల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. దీనికి పరిష్కారంగా ప్రపంచస్థాయి అవకాశాలను భారత్‌లోనే అందించడం ముఖ్యం. ఇందుకోసం ఆర్అండ్‌డీ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాలి. భారత్‌లోకి వస్తున్న విదేశీ వర్సిటీల క్యాంపస్‌ల నాణ్యతను కఠినంగా పర్యవేక్షించాలి. తల్లిదండ్రులు కూడా విదేశాల్లో అస్థిరతలను గుర్తిస్తూ, స్వదేశంలో మారుతున్న విద్యావ్యవస్థ తీరుతెన్నులనూ పరిగణనలోకి తీసుకోవాలి. మన విద్యార్థుల ప్రతిభకు తగిన చదువు, పరిశోధన, ఉద్యోగ అవకాశాలను స్థానికంగా ఎంతమేర కల్పిస్తున్నామనేది దేశాభివృద్ధిని ప్రభావితం చేసే ప్రధానాంశం. ఆ దిశగా మార్పు ప్రారంభమైంది. దాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వం, వర్సిటీలు, పరిశ్రమలపై ఉంది.

# సామాన్యుల సింహ దాహాలు!!

**మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) విభాగం ఇటీవల ఇస్కాన్ (కృష్ణ చైతన్య ఉద్యమ సంస్థ) నిర్వహించే ఈటరీ (మెస్‌లు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు మొదలైనవి)లపై దృష్టి పెట్టింది. ఇస్కాన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. అదొక అంతర్జాతీయ మత, ఆధ్యాత్మిక ఉద్యమం. లక్షలాది అనుయాయులు ఉన్న ఉద్యమమది. అయితే ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే లక్ష్యం స్పష్టంగా ఉన్నది: ఆహార కల్తీని నిరోధించడం. ఆయన దృష్టిలో ఎవరూ చట్టం కంటే ఉన్నతులు కాదు. ఇస్కాన్ సైతం అందుకు మినహాయింపు కాదు. అందుకే ఆ సంస్థ నిర్వహించే ఈటరీలపై దాడులు. ఎఫ్‌డీఏ కమిషనర్‌గా తుకారామ్ ముండే బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లో వెలుగులోకి వచ్చిన ఆహార కల్తీ ఉదంతాలు, అంతకు ముందు 18 నెలల్లో బహిర్గతమైన అటువంటి మొత్తం ఉదంతాల కంటే చాలా చాలా అధికంగా ఉన్నాయి.మరి ప్రజలు ముండేను ఒక సింహంలా భావిస్తుండడంలో ఆశ్చర్యమేముంది? ఒక సూపర్–కాప్ కథ ఆధారంగా రూపొందిన బాలీవుడ్ సినిమా 'సింఘమ్' ప్రేరణతో ముండేను ఒక నిజ జీవిత సింహం అని ప్రజలు పిలుస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి హాని చేసే కల్తీ ఆహారపదార్థాల విక్రయాన్ని అరికట్టేందుకు ఆయన చేపట్టిన చర్యల పట్ల ప్రజల ప్రతిస్పందనలో ఒక నిజం వెల్లడయింది. నిబంధనలు సరిగా పాటించని వ్యాపార సంస్థలు లైసెన్స్‌లు కోల్పోతామేమోనని భయపడుతున్నాయి. చట్టం తమకు సహాయకారిగా ఉన్నదనే ఆశాభావం ప్రజల్లో నిండుగా ఉదయించింది. ప్రభుత్వం ఎప్పుడో అడగవలసిన ప్రశ్నను ఒక అధికారి ఎట్టకేలకు అడుగుతున్నాడని వారు భావిస్తున్నారు: అసలు మీరు మాకు ఎటువంటి ఆహారాన్ని అందిస్తున్నారు?**



అనునిత్యం ఫలహారాలు, భోజనాలు ఇంటిలో కాక బయట హోటళ్లలో చేసేందుకు మనం అలవాటు పడిపోయిన రోజులివి. మిఠాయిలు, మాంసాహార వంటకాలకు ఆన్‌లైన్ ఆర్డర్లు ఇవ్వడానికి మనం బాగా అలవాటుపడిపోయాం. అవి భద్రమైనవని మనం విశ్వసిస్తున్నాం, నిరభ్యంతరకరంగా భుజిస్తున్నాం. అయితే ముండే నేతృత్వంలో ఎఫ్‌డీఏ సిబ్బంది నిర్వహిస్తున్న దాడుల్లో ఆహార భద్రతా నిబంధనలు ఎంతగా ఉల్లంఘనకు గురవుతున్నాయో దిగ్భ్రాంతికరంగా తేటతెల్లమవుతోంది. చట్టాలు లేకపోవడం వల్లనా ఈ పరిస్థితి? కాదు. చట్టాలు ఉన్నాయి. వాటిని అమలుపరచకపోవడమే అసలు సమస్య. మరి చట్టాలను అమలుపరుస్తున్న తుకారామ్ ముండే ప్రజలకు ప్రేమాస్పదుడు కావడంలో ఆశ్చర్యమేముంది?

ఆయన ఒక అసాధారణ వ్యక్తిగా కనిపిస్తున్నారు. నిబంధనలను సాధారణంగా వక్రీకరించే లేదా పూర్తిగా ఎంపిక చేసిన వాటిని మాత్రమే అమలుపరిచే, అసలు పూర్తిగా ఉపేక్షించే వ్యవస్థలో నిర్భయంగా చట్టాలను ఉపయోగించి సత్పరిపాలనను అందిస్తున్న అధికారి ఒక విప్లవశీలిగా కన్పించడం కద్దు. ముండే విషయంలో జరిగింది ఇదే. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్న అధికారిని ఒక సూపర్ హీరోగా ఎందుకు భావిస్తున్నారు? ముండేకు అత్యున్నతస్థాయి అధికారాలు లేవు. అయినా తన పరిమిత అధికారాల వినియోగంతోనే సింహంగా పేరు పొందారు. పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్నవారు వ్యవస్థలోని లోపాలను వాడుకుని తప్పించుకోవడాన్ని నిత్యం చూస్తున్న ప్రజలకు చట్టోల్లంఘనలను ఉపేక్షించని అధికారి ఒక హీరోలా కనిపించడం అసహజమేమీ కాదు. ప్రజా శ్రేయస్సుకై స్వార్థపర శక్తులను ఎదుర్కోవడం ముండేకు ఇదే కొత్త కాదు. తన ఉద్యోగ జీవితం ఆరంభం నుంచీ ఆయన ఈ ధర్మ మార్గంలోనే నడుస్తున్నారు. ఎప్పుడూ ఎక్కడా రాజీపడకపోవడం వల్లే 21 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో 25సార్లు బదిలీ అయ్యారు!

ఒక అధికారి తన బాధ్యతల నిర్వహణలో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ఉద్యోగ సోపానాలను అధిరోహించగలడు. అయితే ఉద్యోగ విధులు నిర్వర్తించడంలో అనివార్యంగా తీసుకోవల్సిన ప్రతి నిర్ణయం విషయంలోనూ దాని పర్యవసానాలు ఎలా ఉంటాయోనని ముందుగా బాగా ఆలోచించవలసిన అగత్యమున్న వ్యవస్థలో నిజాయితీపరుడైన అధికారి మనుగడ సాగించగలగడం చాలా కష్టం. తాను తీసుకోబోయే నిర్ణయంతో ఎవరు ఆశాభంగం చెందుతారు? ఒక రాజకీయవేత్త ఆక్షేపణ తెలుపుతాడా? ధనబలం దండిగా ఉన్న వ్యాపారవేత్త ఎవరైనా అసంతృప్తితో ఫోన్ చేస్తాడా? ఏదైనా ఒక మత వర్గం వారు నిరసనకు దిగుతారా? పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నత స్థాయిలో తమకు ఉన్న సంబంధాలను ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉపయోగించుకుంటారా? అసలు నిర్ణయాన్ని పూర్తిగా అమలుపరచకముందే బదిలీ ఉత్తర్వు వస్తుందేమో?! ఇటువంటి ప్రశ్నలు, సందేహాలతో సతమతమవ్వక తప్పని పరిస్థితులలో ఏ అధికారి అయినా దీక్షాదక్షతలతో ఎలా వ్యవహరించగలడు?

ప్రభుత్వ వ్యవస్థలు తమ స్వతంత్రతను క్రమంగా కోల్పోతున్నాయి. ఎందుకని? ప్రతి ప్రభుత్వాధికారీ అవినీతి పరుడు అయినందువల్లకాదు. అలా భావించడం ఒక మూస పద్ధతిలో ఆలోచించడమే అవుతుంది. స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేవారిని శిక్షిస్తూ, చెప్పినట్లు చేసే వారిని అందలాలు ఎక్కిస్తున్న ఒక వ్యవస్థ సంబంధిత వ్యక్తులందరికీ ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతున్నది. 'స్వతంత్రంగా వ్యవహరించి అపాయాన్ని కొనితెచ్చుకోవద్దు' అని ఒక తీవ్ర హెచ్చరిక చేస్తున్నది. ప్రభుత్వ వ్యవస్థలో తరచూ అతి సులువుగా చేయగలిగే పని... అసలు ఏమీ చేయకపోవడమే. కష్టమైన పని ఏమిటంటే... చేయవలసిన పని చేయడమే!

చేయవలసిన పని చేస్తున్నాడు కాబట్టే తుకారామ్ ముండేను ప్రజలు మౌనంగా మెచ్చుకుంటున్నారు. ఆయనకు మద్దతుగా ఒక పెద్ద రాజకీయ ఉద్యమానికి వారు ఉపక్రమించలేదు. ఇది గమనార్హం. తుకారామ్‌కు మరొక ఉన్నత బాధ్యతను అప్పగించాలని ఎవరూ డిమాండ్ చేయడం లేదు. అయితే ముండే నిర్వహిస్తున్న ప్రతి తనిఖీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రచారంలోకి వచ్చినప్పుడు, పేరు ప్రతిష్ఠలు ఉన్న ఒక సంస్థను ఆయన ప్రశ్నించినప్పుడు ప్రజలు ప్రతిస్పందిస్తున్నారు. వారిలో నిబిడీకృతంగా ఉన్న ధర్మాగ్రహం పురిగొల్పిన ప్రతిస్పందన అది, సందేహం లేదు.

అవును, ఎట్టకేలకు ఎవరో ఒకరు ఏదో ఒకటి చేస్తున్నారు. భారతీయులు నియమ నిబంధనలను స్వతహాగా ఇష్టపడరని కాదు. వాటి అమలులో పక్షపాతాన్ని వారు కచ్చితంగా ఇష్టపడరు. ఈ సంస్థ ఎవరిది? ఎవరికి ఎవరు తెలుసు? ఆ సంస్థకు ఎంత పలుకుబడి ఉంది? దానిపై చర్య తీసుకుంటే ఏ రాజకీయపక్షం లేదా మత సమూహం అది తమకు వ్యతిరేకంగా తీసుకున్నదేనని నొచ్చుకుంటుంది? అన్న ప్రశ్నలే తలెత్తకూడదు. చట్టం అర్థవంతంగా ఉండాలంటే దానిని నిష్పాక్షికంగా అమలుపరచాలి. అందరికీ సమానంగా వర్తింపజేయాలి.

ఇదే తుకారామ్ ముండే సంచలనశీలత నిజమైన పాఠం. ఆయన తన బాధ్యతల నిర్వహణలో ఒక సింహంలా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. 'నిజ జీవిత సింహం' అని ఆయనను పిలుస్తున్నారు. అయితే ఈ ప్రశంసే ఆయన కథలో ఆశ్చర్యకరమైన విషయం కాదు. అసలు ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే - అలాంటి వ్యక్తులే అన్ని అధికార స్థానాలలో ఉండాలని ప్రజలు ఎంతగానో పరితపిస్తుండడమే. ఆహార భద్రత అనేది తుకారామ్ ముండే ఎఫ్‌డీఏ ప్రధానాధికారిగా ఉండడంపై ఆధారపడి ఉండకూడదు. రెస్టారెంట్లు శుచి, శుభ్రత ఉన్న ఆహారాన్ని అందించడమనేది ఒక నిర్దిష్ట అధికారి దాడులు, తనిఖీలు చేస్తున్నాడనే విషయంపై ఆధారపడి ఉండకూడదు. కఠిన వైఖరితో వ్యవహరించే అధికారి ఉన్నప్పుడు మాత్రమే ఆహార కల్తీదారులు భయపడడం జరగకూడదు. ఆ అధికారి బదిలీ అయిన తరువాత కూడా వ్యవస్థ సక్రమంగా పనిచేయాలి. ఇదే ఒక హీరోకు, ఒక వ్యవస్థకు మధ్య వ్యత్యాసం. హీరో ఒక నిర్దిష్ట సమయం లేదా సందర్భంలో మాత్రమే పరిస్థితులను మార్చగలడు. వ్యవస్థ అనేది నిరంతరం నడుస్తుంది. సదా ప్రజాహితంగా నడుస్తుండాలి. అటువంటి వ్యవస్థ ప్రజల దైనిక జీవితాన్ని మెరుగ్గా మార్చివేయగలదు. మన వ్యవస్థలు లేదా సంస్థలు సదా సక్రమంగా పనిచేస్తూ ప్రజల విశ్వసనీయతను పొందగలిగే దాకా ముండే లాంటి వ్యక్తులు అమితంగా ప్రాధాన్యం పొందడమనేది కొనసాగుతూనే ఉంటుంది.

తుకారామ్ ముండే తానేదో మానవాతీత కార్యాన్ని నిర్వహిస్తున్నట్టు ఏ కోశానా భావించరు. తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తున్నట్టు మాత్రమే చెబుతారు. మరి ప్రతి ప్రభుత్వోద్యోగి కూడా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, పక్షపాతానికి తావివ్వకుండా, తన పై అధికారులకు భయపడకుండా తన విధులను తాను నిర్వహిస్తే మన ప్రభుత్వ వ్యవస్థల్లోను, సమాజంలోను పరిస్థితులు ఎలా ఉంటాయో ఆలోచించండి. మన దేశంలో చట్టాలు, విధానాలు, పథకాలు, కమిటీలకు కొరత లేదు. అయితే వాటిని సరిగ్గా అమలుపరచకపోవడమే దేశం అనునిత్యం ఎదుర్కొంటున్న ఒక పెద్ద సమస్య. ప్రభుత్వ సిబ్బంది తమ విధులను నిజాయితీగా స్వచ్ఛందంగా స్వతంత్రంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందో కదా. భారతదేశ పాలనా సంక్షోభం గణనీయంగా తగ్గుతుంది, సందేహం లేదు. ఇదే జరిగితే తుకారామ్ ముండే లాంటి నిజ జీవిత సింహాలను అన్వేషించవలసిన అవసరం మనకు ఉండదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమ విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తే అసాధారణ వ్యవహారశైలికి ఆస్కారముండదు. అంతా సాధారణంగానే ఉంటుంది. పరిస్థితులు సజావుగా ఉంటాయి. అందరికీ సమన్యాయం సమకూరుతుంది.

తాజా కలం: తుకారామ్ ముండే గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని ఒక మహారాష్ట్ర మంత్రివర్యుడిని ప్రశ్నించాను. 'అతడొక పిచ్చివాడు' అని ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు. నిజానికి తమ రాజకీయ యజమానులకు భయపడకుండా ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేసే ముండే లాంటి 'ఉన్మాద' అధికారులు ఇప్పుడు మన దేశానికి చాలా చాలా అవసరం కదూ?!

# అగ్రరాజ్య పెత్తందారీతనం!

సర్వసత్తాక సార్వభౌమ రాజ్యాల సమాహారమే ప్రపంచం. దేశాలన్నీ పరస్పరం సార్వభౌమత్వాన్ని గౌరవించుకోవడం విశ్వశాంతికి ప్రాథమిక అవసరం. అంతర్జాతీయ వ్యాపార, దౌత్య సంబంధాల నిర్వహణలో ప్రతి దేశమూ స్వీయ ప్రాథమ్యాలకు అనుగుణంగా వ్యవహరించడం సహజం. దాన్ని ఓపలేని అమెరికా అందరూ తన అడుగుజాడల్లోనే నడుచుకోవాలని భీష్మిస్తుంటుంది. ఆ పెత్తందారీతనంతోనే సైనిక జోక్యాలు, వాణిజ్య యుద్ధాలతో ప్రపంచాన్ని సంక్షోభాల్లోకి నెట్టడం అగ్రరాజ్యానికి రివాజైంది. ట్రంప్ అధ్యక్షతన టారిఫ్‌ల బాదుడుతో ఇప్పుడు విశ్వవాణిజ్యాన్ని అతలాకుతలం చేస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్, రష్యాలను మరింతగా చక్రబంధంలో ఇరికించడంతో పాటు వాటితో వ్యాపారం చేసే చైనా, భారత్ వంటి దేశాలపై సుంకాల మోతకు అధ్యక్షుడికి అధికారమిచ్చే బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ తాజాగా ఆమోదముద్ర వేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మూలంగా ఇంధన మార్కెట్లు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. అది చాలదన్నట్లు రష్యా చమురుకు అమెరికా మోకాలడ్డితే ధరలు ఇంకా పైకి ఎగబాకే ప్రమాదముంది. మాస్కో నుంచి మరెవ్వరూ ఆయిల్ కొనకూడదంటూ కన్నెర్ర చేస్తున్న అమెరికా తన అణు పరిశ్రమ అవసరాలకు మాత్రం అక్కడి నుంచే యురేనియం కొనుగోళ్లకు సై అంటోంది. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా అగ్రరాజ్యం ఆడుతున్న ఆధిపత్య క్రీడలు ప్రపంచ శ్రేయస్సుపై క్రీనీడలను ప్రసరింపజేస్తున్నాయి!

ఇచ్చిన మాట మేరకు రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ట్రంప్ ఆపలేకపోయారు. పైగా సమరానికి దిగకుండా ఉండాల్సిందని కీవ్‌నే తప్పుపట్టారు. తన విపరీత ధోరణితో ఆయన పాశ్చాత్య దేశాలను ఒకపక్క విస్మయానికి గురిచేస్తే అదే సమయంలో ఆర్థిక ఆంక్షల సవాళ్లను రష్యా చాకచక్యంగా ఎదుర్కొంది. మార్కెట్లు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, షాడో ఫ్లీట్ వంటి వాటి ద్వారా ఇక్కట్లను అధిగమించింది. ఈ పరిస్థితుల్లో యుద్ధానికి ముగింపు పలికే నెపంతో మాస్కోపై మళ్లీ కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ ఎంతవరకు నెగ్గుకురాగలరన్నది ప్రశ్నార్థకమే! రష్యా చమురును కొనుగోలు చేస్తూ యుద్ధరక్కసి కోరలకు పదును పెడుతున్నారని ఇతర దేశాలపై గుడ్లురుముతున్న ట్రంప్ ఇజ్రాయెల్‌తో కలిసి చేసిందేంటి? ఇరాన్‌పై దండెత్తి హార్మూజ్ జలసంధి మూసివేతకు కారణమై ఇంధన కల్లోలాన్ని సృష్టించారు. ఆయుధాలతో ఇరాన్‌పై గెలవలేక ఇప్పుడు ఆ దేశాన్ని మరిన్ని ఆంక్షల చట్రంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇక శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న చైనా డాలర్ ఆధిపత్యానికి గండికొట్టాలని చూస్తోంది. గతంలో ట్రంప్ టారిఫ్‌లకు ప్రతిసుంకాలతో గట్టిగా బదులిచ్చిన బీజింగ్ కీలక ఖనిజ సరఫరాలను నియంత్రించి అగ్రరాజ్యం వెనక్కి తగ్గేలా చేసింది. కాబట్టి ప్రతిపాదిత నూతన సుంకాలతో చైనాను నిలువరించడమూ అమెరికాకు అంత సులభసాధ్యం కాదు!

ఇండియాఅమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఒక కొలిక్కి రానుందన్న కథనాలు వెలువడుతున్నాయి. అందులో తనకు అనుకూలమైన నిబంధనల కోసం భారత్‌పై ఒత్తిడి పెంచాలన్న అగ్రరాజ్య కుటిల తలంపే తాజా బిల్లులో కనిపిస్తోంది. అమెరికాతో ఒప్పందం వల్ల దేశీయ రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తామని కేంద్రం ఇప్పటికే స్పష్టంచేసింది. విదేశాల నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో భారతావని ఇంధన భద్రతకే ప్రాధాన్యమిస్తామని మొన్న కూడా తేల్చిచెప్పింది. ఆ మేరకు అమెరికాతో సంప్రదింపులు సాగిస్తూనే కీలక రంగాల్లో స్వావలంబన సాధనపై ప్రభుత్వం మరింతగా దృష్టిసారించాలి.

# వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు నో పర్మిషన్



## 10 మంది విద్యార్థినుల జడల కత్తిరించారు

- భీమిలి కేజీబీవీ బాలికల హాస్టల్‌లో కలకలం
- మిస్టరీగా మారిన ఘటన
- విచారణ జరుపుతున్న అధికారులు
- ఒక్క జడ వేసుకున్న బాలికల జడలే కత్తిరించారు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

విశాఖపట్నంజిల్లా భీమిలి కస్తూర్బాగాంధీ (కేజీబీవీలో) బాలికల విద్యాలయం హాస్టల్‌లో కలకలం రేగింది. కొందరు విద్యార్థినుల జడల కత్తిరించడం కలకలం రేపింది. ఈ నెల 16న రాత్రి ఈ ఘటన జరగ్గా.. తాజాగా బయటపడింది. భీమిలి కేజీబీవీలో మొత్తం 38 మంది 9వ తరగతి విద్యార్థినులకు హాస్టల్‌లో రెండు గదులు కేటాయించారు. ఈ నెల 16న రాత్రి 12 గంటల వరకు ప్రమీల అనే టీచర్ ఆధర్వ్యంలో స్టడీ అవర్ నిర్వహించారు.. అనంతరం విద్యార్థినులు నిద్రపోయారు. ఆ మరుసటి రోజు ఉదయం విద్యార్థినులు నిద్రలేచి చూడగానే 10మంది విద్యార్థినిల జడలు కత్తిరించినట్లు గుర్తించారు. 20మంది విద్యార్థినులు ఒక గదిలో నిద్రించగా ఆరుగురు.. 18మంది నిద్రించిన గదిలో నలుగురు విద్యార్థినుల జడలు కత్తిరించించారు. వెంటనే బాధిత విద్యార్థినులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు.

అంతేకాదు హాస్టల్‌లో రెండు జడలు వేసుకున్న వారివి కాకుండా ఒక జడ వేసుకున్న బాలికల జుత్తును మాత్రమే కత్తిరించారు. హాస్టల్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.. కాబట్టి బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించే అవకాశం లేదని భావిస్తున్నారు. హాస్టల్‌లో తోటి విద్యార్థినులే ఈ ఆకతాయి పని చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తే విద్యార్థినులు ఎవరిపైనా అనుమానం వ్యక్తం చేయలేదంటున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని.. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఇవాళ బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు ప్రిన్సిపల్.

భీమిలి కస్తూర్బాగాంధీ (కేజీబీవీలో) బాలికల విద్యాలయం హాస్టల్‌లో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశమైంది. భద్రత ఉండే హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు జరగడం సంచలనంగా మారింది. బయట నుంచి వ్యక్తులు వచ్చే అవకాశం లేదని చెబుతుండటంతో.. ఇంటి దొంగల పనిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు మరింతగా ఆరా తీస్తున్నారు.. త్వరలోనే దీని వెనుక ఎవరున్నారో తెలిపోతుందంటున్నారు.

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

చేతిలో పూలు.. నోట భక్తిగీతాలు.. చుట్టూ గణపతి నామస్మరణ.. ఆనందోత్సాహాలతో సాగాల్సిన వినాయక నిమజ్జన వేడుకలు కొన్ని చోట్ల విషాదంగా మారుతున్నాయి. విగ్రహాన్ని సాగనంపేందుకు రోడ్లపైకి వచ్చిన కుటుంబాలు.. స్నేహితులు.. యువత.. కాసేపటి క్రితం వరకు ఉత్సాహంగా కనిపించిన వారిలో కొందరు ఒక్కసారిగా కుప్పకూలుతుండటం కలవరపెడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి రెండు రోజుల్లో నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన సందర్భాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో శనివారం జరిగిన గణేష్ శోభాయాత్రలో రాము (34) అనే వ్యక్తి డ్యాన్స్ చేశాడు. ఊరేగింపు తన ఇంటి ముందుకు వచ్చిన సమయంలో మెట్లపై కూర్చున్న ఆయన కొద్దిసేపటికే కుప్పకూలారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోనూ శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గణేష్ నిమజ్జన ఊరేగింపులో కాకర్లమూడి ఈసు అనే వ్యక్తి ఇతరులతో కలిసి డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిమజ్జన వేడుకల్లో భద్రతపై చర్చ మొదలైంది.

కర్నూలు రూరల్ మండలం ఇ.తాండ్రపాడు గ్రామంలో శుక్రవారం శివమ్మ (36) నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. డ్యాన్స్ చేసిన అనంతరం అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్థానికంగా డీజే శబ్దం గురించి చర్చ జరిగినప్పటికీ.. ఆమె మరణానికి అదే ప్రత్యక్ష కారణమని అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

అదే రోజు నంద్యాల జిల్లా డోన్‌లో గణేశ్ గౌడ్ (23)



నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్లిన తర్వాత ఛాతిలో నొప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు చెప్పినట్టు సమాచారం. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఇలాంటి విషాదమే చోటుచేసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో శ్రీకాంత్ (35) ఊరేగింపులో పాల్గొంటూ కుప్పకూలారు. అనంతపురం జిల్లా గుత్తిలో అశోక్ కుమార్ (28) వినాయక మండపం వద్ద పాటలకు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలినట్లు సమాచారం. ఈ రెండు ఘటనల్లోనూ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ ఘటనలన్నీ దాదాపు ఒకే తరహాలో చోటుచేసుకోవడంతో డీజే శబ్దాలపై చర్చ మొదలైంది. అయితే ఒక వ్యక్తి గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు కేవలం శబ్దమే కారణమని నిర్ధారించాలంటే వైద్యపరమైన పరీక్షలు, మృతదేహ పరీక్ష నివేదికలు, వ్యక్తి గత ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం ఆరోగ్యానికి హానికరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) స్పష్టం చేస్తోంది.

డబ్ల్యూహెచ్ఓ ప్రకారం సగటున 80 డెసిబుల్స్ శబ్దానికి వారానికి 40 గంటల వరకు సురక్షితంగా వినొచ్చని సూచించింది. శబ్ద తీవ్రత 90 డెసిబుల్స్‌కు చేరితే ఈ సమయం 4 గంటలకు.. 100 డెసిబుల్స్ వద్ద 20 నిమిషాలకు తగ్గుతుంది. శబ్ద తీవ్రత పెరిగే కొద్దీ సురక్షితమైన ఎక్స్‌పోజర్ సమయం వేగంగా తగ్గుతుంది. డబ్ల్యూహెచ్ఓ నిర్వహించే సేఫ్ లిజనింగ్ మార్గదర్శకాల్లో పెద్ద ఈవెంట్లకు సగటు శబ్ద స్థాయిని 100 డెసిబుల్స్‌కు మించకుండా పర్యవేక్షించడం, శబ్దాన్ని కొలిచే పరికరాలు వినియోగించడం, ప్రజలకు వినికిడి రక్షణ కల్పించడం వంటి సూచనలు ఉన్నాయి.

వినాయక చవితి వేడుకల్లో డీజేలు కొత్త విషయం కాదు. యువతకు డ్యాన్స్, భారీ సౌండ్, రంగురంగుల లైట్లు ఇవన్నీ వేడుకల్లో భాగమయ్యాయి. ఒక మండపం కంటే మరో మండపం భారీ సౌండ్‌తో ఉండాలనే పోటీ కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది.

కానీ ఆ కొన్ని గంటల ఉత్సాహం.. ఒక కుటుంబానికి జీవితాంతం మిగిలే విషాదంగా మారితే.. నిమజ్జనం కోసం బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోతే.. డ్యాన్స్ చేస్తూ ఆనందించిన యువకుడు నిమిషాల వ్యవధిలో ప్రాణాలు కోల్పోతే.. ఆ కుటుంబం ఎదుర్కొనే వేదనను ఏ వేడుకా భర్తీ చేయలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజును కొందరు యువకులు ఆదివారం కలిసి నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అయితే ఉండి నియోజకవర్గ పరిధిలో వినాయక నిమజ్జనాల్లో డీజే సౌండ్స్‌కు అనుమతి ఇవ్వబోమని రఘురామ స్పష్టం చేశారు. డీజే శబ్దాలతో యువత ప్రాణాలు కోల్పోతున్న ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక వార్తాపత్రికలో వచ్చిన డీజే శబ్దానికి సంబంధించిన మరణ వార్తను యువకులకు చూపించినట్లు సమాచారం. దీంతో డీజేలు లేకుండానే నిమజ్జనం నిర్వహిస్తామని యువకులు అంగీకరించినట్లు తెలుస్తోంది.

వినాయక నిమజ్జనం అంటే ఒక ఉత్సవానికి ముగింపు మాత్రమే కాదు.. కుటుంబం మొత్తం కలిసి పాల్గొనే ఆధ్యాత్మిక కార్యక్రమం. అందులో పిల్లలు, మహిళలు, వృద్ధులు, యువత.. అన్ని వర్గాలవారు ఉంటారు. అందుకే నిర్వాహకులు శబ్ద తీవ్రత, డ్యాన్స్ చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితి, గుంపుల నియంత్రణ, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ముందుగానే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. భక్తి పేరుతో మోత పెంచడం కంటే.. భక్తితోనే గణపతిని సాగనంపడం ముఖ్యమని.. ఒక పాట ఆపితే వేడుక ఆగదని.. డీజే సౌండ్ తగ్గిస్తే ఉత్సాహం తగ్గాల్సిన అవసరం లేదని.. కానీ ఒక కుటుంబంలో ప్రాణం ఆగిపోతే మాత్రం ఆ ఇంటి ఆనందం శాశ్వతంగా ఆగిపోతుంది.

## ఐఐటీ బాంబేలో విద్యార్థి ఆత్మహత్య

### కులవివక్షే కారణం.. యువకుడి తండ్రి ఆరోపణ

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంతజనశక్తి న్యూస్**

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే లో బీటెక్ విద్యార్థి సాహిల్ వాకోడే (22) ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసులో తాజాగా మరో కోణం వెలుగుచూసింది. కులవివక్ష కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని సాహిల్ తండ్రి ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రొఫెసర్ సూర్యనారాయణ్ దుల్లా తన కుమారుడిపై కులానికి సంబంధించిన అవమానకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అతడిని తప్పుడు కేసులో ఇరికిస్తానని బెదిరించారని ఆరోపించారు. సాహిల్ తండ్రి ఫిర్యాదు మేరకు దుల్లాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐఐటీ బాంబేకు చెందిన మరికొందరు అధికారులపైనా ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. మరోవైపు, సాహిల్ తల్లి కూడా తన కుమారుడు వేధింపులకు గురయ్యాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని కోరారు. 'నా కుమారుడిని వేధించారు. నేను ఫిర్యాదు చేస్తాను. నా బిడ్డకు న్యాయం కావాలి' అని ఆమె పేర్కొన్నారు. కాగా, విద్యార్థి మరణానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు కోసం ఉన్నతాధికారులు కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. పరీక్ష ఘటన, అనంతరం జరిగిన పరిణామాలు, విద్యార్థి కుటుంబం చేసిన ఆరోపణలు సహా అన్ని అంశాలను పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.


శుక్రవారం జరిగిన పరీక్షలో ప్రశ్నపత్రాన్ని చాట్‌జీపీటీలో అప్‌లోడ్ చేసి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించాడని సాహిల్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే ప్రొఫెసర్ అతడిని మందలించారని ఐఐటీ బాంబే తెలిపింది. అనంతరం సాహిల్ తన హాస్టల్ గదికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపింది. మరోవైపు, సాహిల్ మృతిపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. క్యాంపస్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ఐఐటీ బాంబే సమాధానం చెప్పాలని ఆందోళన చేపట్టాయి.

## సూపర్ ఎల్ నినోను కలిసి ఎదుర్కొందాం

**అమరావతి, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

ఎల్‌నినో ప్రభావంతో రైతులకు నష్టం రాకుండా, ధరలు అదుపుతప్పకుండా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణకు సిద్ధమైంది. ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాల్‌గా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతులను కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపుతప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలని సూచించారు.

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష





సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సీఎం ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. పప్పు ధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నప్పటికీ నూనెగింజల సాగు తక్కువగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్లాన్‌ను పరిస్థితులకు అనుగుణంగా సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉందని సీఎం వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా, ఎల్ నినో కారణంగా 79 శాతం భూముల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే రూ. 60 కోట్లతో కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందించామని తెలిపారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ. 190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, పశువులకు నీరు, తగినంత పశుగ్రాసం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీనీవా ద్వారా చివరి భూములకు, తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. విపత్తు సమయాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని, ఎల్ నినో సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ముంబైలో ఘోర ప్రమాదం

### బ్రిడ్జిపై నుంచి పడిన బీఎండబ్ల్యూ,

**ముగ్గురి మృతి.. 20 ఏళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు**



ముంబైలోని కోస్టల్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బ్లాక్ బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో 20 ఏళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నాయర్ ఆసుపత్రిలోని ట్రామా వార్డులో చికిత్సకు తరలించారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, బీఎండబ్ల్యూ కారు మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు కోస్టల్ రోడ్డుపై ప్రయాణిస్తోంది. లొటస్ జెట్టీ సమీపంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి సరిహద్దు గోడను ఢీకొట్టింది. అనంతరం బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయింది. ప్రమాదం ఆదివారం ఉదయం సుమారు 5:20 గంటలకు జరిగినట్లు కోస్టల్ రోడ్ కంట్రోల్ రూమ్ తెలిపింది. కారులో ఉన్న నలుగురినీ నాయర్ ఆసుపత్రికి తరలించారు. అయితే వారిలో ముగ్గురు ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు .

ప్రమాద తీవ్రతకు కారు దెబ్బతిన్న తీరు అద్దం పడుతోంది. బ్రిడ్జిపై ఉన్న సూచిక బోర్డును కారు ఢీకొట్టడంతో అది కూడా దెబ్బతింది . బీఎండబ్ల్యూ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. విండ్‌షీల్డ్ పగిలిపోయింది, పైకప్పు లోపలికి వంగిపోయింది. బంపర్ ఊడిపోవడంతో కారు అంతర్గత భాగాలు బయటకు కనిపించే స్థాయిలో వాహనం దెబ్బతింది. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



## మేము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

2009లో కోస్గి ఎన్నికల ప్రచారంలో తనతో పాటు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారని ఆమె గుర్తుచేశారు. వారిద్దరూ తర్వాత ముఖ్యమంత్రులు అయ్యారని కవిత చెప్పడంతో సభలో కొద్దిసేపు 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు వినిపించాయి. తాను అప్పటి ఎన్నికల ప్రచారంలో మూడో వ్యక్తినని చెబుతూ.. కోస్గి జూనియర్ కాలేజీ సెంటిమెంట్, కొడంగల్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల ఆశీస్సులు తనపై ఉంటే.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీదే అధికారమని కవిత ధీమా వ్యక్తం చేశారు.

అయితే తాను ముఖ్యమంత్రి అవుతానని ఆమె నేరుగా ప్రకటించకుండా.. చంద్రబాబు, రేవంత్ రెడ్డి పేర్లను సభలో ప్రస్తావించి.. తన రాజకీయ ప్రస్థానాన్ని ఆ సెంటిమెంట్‌తో అనుసంధానం చేశారు. తనపై వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలపై కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నేతలు తనను కాంగ్రెస్ విడిచిన బాణంగా అభివర్ణిస్తున్నారని.. అదే సమయంలో.. సీఎం రేవంత్‌రెడ్డి తనను కేసీఆర్ వదిలిన బాణంగా చెబుతున్నారని ఆమె అన్నారు. మరికొందరు బీజేపీ బాణమంటున్నారని పేర్కొంటూ.. తాను ఎవరి బాణాన్ని కాదని.. తెలంగాణ బహుజనుల బాణాన్ని అని ప్రకటించారు.

అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల



కోసం తన పోరాటం కొనసాగుతుందని కల్వకుంట్ల కవిత చెప్పారు. యువత యుద్ధ నినాదం, మహాత్మా జ్యోతిబా పూలే ఆత్మగౌరవ భావన, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలు, సావిత్రిబాయి పూలే ఆశయాల కోసం తాను ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఒక మహిళ ఎలాంటి రాజకీయ అండ లేకుండా కూడా రాజకీయంగా నిలబడగలదని నిరూపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

ప్రజలు తనకు మద్దతు ఇస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అయినా.. సీఎం రేవంత్‌రెడ్డితో అయినా.. కేసీఆర్‌తో అయినా పోరాడతానని కవిత తేల్చి చెప్పారు. తెలంగాణలో రాజకీయాలు కేవలం పరస్పరం విమర్శలు, దూషణలకే పరిమితం కావద్దని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుత అసెంబ్లీ రాజకీయాల తీరును ప్రస్తావిస్తూ ప్రజా గాయకుడు గద్దర్ పాటలోని పంక్తులను ఆలపించారు. 'భలే గుండిరో మన అసెంబ్లీ..' అంటూ గద్దర్ పాటను గుర్తుచేసి ప్రస్తుత రాజకీయాలపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సభలో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

తెలంగాణ రైతుల సమస్యలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. రైతులకు నీళ్లు, యూరియా, ధాన్యం కొనుగోళ్ల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వరి, మొక్కజొన్న రైతుల పంటలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆమె ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంపైనా కవిత మాట్లాడారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు భారీగా నిధులు ఖర్చు చేస్తామని ఆమె ప్రకటించారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తున్నప్పటికీ.. వంటింట్లోని గిన్నెలపైనా పురుషుల పేర్లే కనిపిస్తున్నాయని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని రాష్ట్రాల్లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం గురించి ప్రస్తావిస్తూ.. మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదగడానికి తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కోస్గి సభను తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ విస్తరణలో కీలక కార్యక్రమంగా నిర్వహించింది. ఇప్పటికే నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించిన ఆ పార్టీ.. తదుపరి ఇంద్రవెల్లిలో కూడా సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

## భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏసీబీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వే ఐజీగా బదిలీ చేయడంతో పాటు, సీఐడీ ఉమెన్ సేఫ్టీ ఐజీగా కూడా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణా టాటాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఐజీగా పోస్టింగ్ దక్కింది.పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో అధికారి విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్ కేటాయించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా సేవలందించిన బాబూజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేయడం జరిగింది. పోలవరం ఓఎస్డీగా పనిచేసిన పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. సీఎంఎస్‌జీ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన జగదీశ్ అదహళ్లిని పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.



# దేవరకద్రలో రూ.134.98 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన



**దేవరకద్ర సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

నియోజకవర్గంలో రూ.134.98 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు కీలక రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. మినిగోనిపల్లి వద్ద ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) కలిసి పనులకు శ్రీకారం చుట్టారు.దేవరకద్ర-మినిగోనిపల్లి-గుడిబండ-ముచ్చింతల-తిరుమలాపూర్-దాసర్‌పల్లి-గూడూరు మీదుగా కురుమూర్తి స్వామి దేవస్థానం, అక్కడి నుంచి వెంకంపల్లి-పేరూరు-ముత్యాలంపల్లి-వర్ణే వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.103.54 కోట్లు కేటాయించారు.జాతీయ రహదారి-44 నుంచి పొన్నకల్-నందిపేట్-జీనుగురాళ్ల-డోకూర్ మీదుగా దేవరకద్ర వరకు రహదారి నిర్మాణ, మరమ్మతులకు రూ.13.43 కోట్లు, భూత్పూర్ చౌరస్తా నుంచి భూత్పూర్-కొత్తమొల్గర-వెలికిచర్ల-భట్టుపల్లి తండా మీదుగా కర్వేన వరకు రహదారి విస్తరణ, మరమ్మతులకు రూ.18.01 కోట్లు మంజూరయ్యాయి.ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు కురుమూర్తి స్వామి దేవస్థానానికి రాకపోకలు సులభతరం కానున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# వైభవంగా గణేష్ ఉత్సవాలు

**- ఘనంగా అన్నప్రసాద వితరణ**

**- సాగర్ పాత బస్టాండ్ గణేష్ వేడుకలు**


**నాగార్జునసాగర్,సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

నాగార్జునసాగర్ పట్టణంలోని పైలాన్ కాలనీ పాత బస్టాండ్ వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ఆదివారం కొనసాగుతున్నాయి,ఈ సందర్భంగా భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు,పట్టణ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు,ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలందరి ఆశీస్సులు,సహకారంతోనే వినాయక నవరాత్రి వేడుకలను ఇంత ఘనంగా,నిర్వహించగలుగుతున్నామని తెలిపారు.పట్టణ ప్రజల సుభిక్షం, ఐక్యత కోసం స్వామివారిని ప్రార్థించినట్లు వారు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని,అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని ప్రసాదం స్వీకరించడం ఎంతో సంతోషాన్నిచ్చిం దని ఉత్సవ కమిటీ సభ్యులు ధీరజ్ , సురేష్,వెంకట్ రావు,చిన్న రావు,టెంట్ హౌస్ మల్లికార్జున్ రావు వెల్లడించారు.



# శాలివాహననగర్‌లో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం

**దిల్‌సుఖ్‌నగర్ సెప్టెంబర్ 20 (అనంత జనశక్తి న్యూస్**



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాలివాహననగర్‌లోని టీమ్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేష్ గోయల్ సమక్షంలో భక్తులకు ఘనంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలుగా భక్తులకు వరుసగా మూడు రోజుల పాటు అన్నప్రసాదం అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# శ్రీనగర్ కాలనీలో నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన మాజీ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి





**హైదరాబాద్, సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

నగరంలో గత 44 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న నిఖిల్ హాస్పిటల్స్, అడ్వాన్స్డ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ మరియు న్యూరో ఇంటర్వెన్షనల్ కేర్ సేవల కోసం ప్రత్యేకంగా "నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (NHI)" ని ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభించింది. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డులోని నిఖిల్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మాజీ లోక్‌సభ సభ్యులు శ్రీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సేవలు దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నారం క్రాస్ రోడ్స్ ఉన్న హాస్పిటల్ శాఖలో కూడా అందుబాటులో ఉంటాయని యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా మాజీ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ, "నాలుగు దశాబ్దాలకు పైగా నిఖిల్ హాస్పిటల్స్ ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందిస్తోంది. ప్రస్తుత కాలంలో అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. ఈ నియోజకవర్గంలో మెరుగైన ఉచిత, అత్యవసర వైద్య సేవలు అందడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO) శ్రీ డాక్టర్ పుట్లా శ్రీనివాస్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సోమాజిగూడ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ శ్రీమతి వనమ్ సంగీత యాదవ్, నిఖిల్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అమిత సుంకరినేని ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.ఆధునిక క్యాథ్ ల్యాబ్, స్మార్ట్ కార్డియాక్ ఐసీయూ: ఈ సందర్భంగా సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిశాంత్ సుంకరినేని మాట్లాడుతూ, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో ప్రతీ సెకను కీలకమని, అందుకే నిమిషాల్లో రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించేలా హైఎండ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ క్యాథెటరైజేషన్ ల్యాబ్, స్మార్ట్ కార్డియాక్ ఐసీయూను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటల పాటు నిపుణులైన వైద్యుల బృందం ఇక్కడ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నిఖిల్ సుంకరినేని మాట్లాడుతూ, కార్డియాక్ తరహాలోనే అత్యవసర న్యూరో (నరాల సంబంధిత) సమస్యలకు కూడా త్వరితగతిన చికిత్స అందించేలా న్యూరో ఇంటర్వెన్షనల్ కేర్ సేవలను విస్తరించినట్లు తెలిపారు.అక్టోబర్ నెల అంతటా రూ. 999 కే ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలు: ఈ ప్రారంభోత్సవం సందర్భంగా అక్టోబర్ నెల అంతటా ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలను అందిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ప్రకటించింది.కార్డియాక్ ప్యాకేజీ: సాధారణంగా రూ. 10,000 విలువైన ఈ ప్యాకేజీని అక్టోబర్ నెలలో రూ. 999 కే అందిస్తున్నారు. ఇందులో 2D ఎకో (Echocardiogram), ఈసీజీ (ECG), రక్త పరీక్షలు మరియు కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటాయి.

న్యూరో ప్యాకేజీ: రూ. 10,000 విలువైన ఈ ప్యాకేజీ కూడా రూ. 999 కే లభిస్తుంది. ఇందులో సీటీ స్కాన్ (CT Scan), రక్త పరీక్షలు మరియు న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్ కలవు.

నిఖిల్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అమిత సుంకరినేని మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అత్యాధునిక వైద్యాన్ని సరసమైన ధరల్లో అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

# భూమి అంటే ప్రజలకు రక్తసంబంధంతో సమానం



**- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**- జీవో 118 లో లోపాలను సరిచేసి సేల్ డీడ్ లను అందిస్తున్నామని వెల్లడి**

**- కష్టపడి స్థలాలు కొనుక్కుంటే ప్రజలను భూ ఆక్రమణదారులని గత ప్రభుత్వంలో కన్వీనియన్స్ డీడ్ ఇచ్చారు: మధుయాష్కి గౌడ్**

**- తమ ప్రభుత్వం పూర్తి యాజమాన్య హక్కులతో సెల్ డీడ్ లను ఇస్తుందని వెల్లడి**

**హైదరాబాద్ సెప్టెంబర్ 20, అనంత జనశక్తి న్యూస్**

భూమి అంటే ప్రజలకు రక్తం బంధంతో సమానమని, వారికి సంబంధించిన ప్రతి భూ సమస్యలను ఈ ప్రజా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జీవో 118 బాధితులతో సమావేశం, వారికి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సరూర్నగర్ ఇండోర్ 1 స్టేడియంలో నిర్వహించారు.రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ , మైనారిటీ శాఖ మంత్రివర్యులు అజారుద్దీన్ , ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్ పర్సన్ మధుయాష్కి గౌడ్ , ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులకు తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భద్రత, భరోసా, రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. జీవో 118 విషయంలో లోపాలు ఉన్నాయని, నా వద్దకు మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ , కాలనీవాసులను తీసుకొని రాగానే..అధికారులందరినీ కూర్చోబెట్టి ఆ లోపాలను సరి చేసే విధంగా నిబంధనలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నగరంలో ఏ ఒక్క ఇల్లును కూల్చబోదని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో వారి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. 22ఏ సమస్యలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉన్నాయని.. తమ ప్రభుత్వం కొత్తగా చేర్చిందేమీ లేదన్నారు.అయినప్పటికీ 22a లో అకారణంగా చేర్చిన భూములు అన్నింటిని తొలగించే విషయంపై చర్చిస్తున్నట్టు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసిన 12 అంశాలను 45 రోజుల్లోనే పరిష్కరించే విధంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. పది రోజుల్లోనే అన్ని అంశాలపై క్లారిటీ ఇస్తామని వివరించారు. జీవో 118 లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ శాశ్వతంగా సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని.. ఖాళీ స్థలాలు, ఇళ్ల నిర్మాణం ఉన్న అన్నింటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొని వారికి కూడా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్ , అజరుద్దీన్ ప్రసంగించి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు వివరించారు.మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ హయాంలో దోపిడీయే లక్ష్యంగా పాలన సాగిందన్నారు. జీవో 118 పేరుతో లోప భూయిష్టంగా .. ప్రజలు కష్టపడి కొనుక్కున్న ఆస్తులను భూ అక్రమ దారులుగా పేర్కొంటూ డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ ను అందజేశారని విమర్శించారు. తామంతా రెవిన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి దగ్గరికి వెళ్లి.. 118 జీవో లో లోపాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించామన్నారు. ఈ క్రమంలో డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ కు బదులుగా పూర్తి యాజమాన్య హక్కులతో కూడిన సేల్ డీడ్ ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ ఆస్తులను అమ్ముకోవాలనుకున్నా, గిఫ్ట్ ఇవ్వాలనుకున్న, మార్టిగేజ్ చేయాలనుకున్న, బ్యాంకు లోన్లకైనా ఎలాంటి ఎన్ ఓ సీ లేకుండా.. ప్రభుత్వ సంస్థల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నూతన సెల్ డీడ్ ను అందజేస్తున్నట్లు వివరించారు.

రాజకీయాల కతీతంగా, ఓట్ల ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సమస్య పరిష్కరించాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరిస్తున్నారని వివరించారు.అంతేకాకుండా నిషేధిత జాబితా అయిన 22 ఏ నుంచి కూడా తొలగించేలా రెవిన్యూ మంత్రి గారు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ధరణి పేరుతో భూ దోపిడీ సాగిందని వివరించారు. ఈ సందర్భంగా పలువురికి సేల్ డీడ్ పత్రాలను మంత్రి శ్రీనివాస్ రెడ్డి ..ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , మధుయాష్కి గౌడ్ గార్లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి , ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా , జోనల్ కమిషనర్ వికాస్ మహతో , ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి , జగదీశ్వర్ రెడ్డి , సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్ , యాదవ్ కార్పొరేషన్ వైస్ చైర్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ , యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ , మాజీ కార్పొరేటర్లు దరిపెల్లి రాజశేఖర్ రెడ్డి , రాగుల వెంకటేశ్వర్ రెడ్డి , బానోతు సుజాత నాయక్ , ముద్దగోని లక్ష్మీ ప్రసన్న , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, డివిజన్ల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



# ఘనంగా గణనాథుని శోభాయాత్ర





**- కొత్త బ్రిడ్జి వద్ద కన్నులపండువగా వీడ్కోలు**

**- ఒక్కరోజే 100 విగ్రహాల నిమజ్జనం**

**నాగార్జునసాగర్,సెప్టెంబర్ 20 అనంత జనశక్తి న్యూస్**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాగార్జునసాగర్ పట్టణంలో నిమజ్జన సందడి మొదలైంది ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు తమ ఆరాధ్య దైవమైన వినాయకుడికి వీడ్కోలు పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు,సాగర్ కొత్త బ్రిడ్జి వద్ద నిమజ్జన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు,యువజన సంఘాలు,భక్తులు డప్పు చప్పుళ్ళ,భజనల మధ్య గణనాథుల శోభాయాత్రలను నిర్వహించి కొత్త బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు,కేవలం ఒక్క ఆదివారం నాడే సాయంత్రానికి సుమారు 100కి పైగా గణేష్ విగ్రహాలను విజయవంతం గా నిమజ్జనం చేసినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు,భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ మున్సిపల్ యంత్రాంగం,పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు,మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనులు వేగవంతంగా సాగుతుండగా,రాబోయే రోజుల్లో నిమజ్జనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



సోమవారం ।రంగారెడ్డి
21.09.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# 25 ఏళ్లకే నాలుగో దశ క్యాన్సర్: ఆ హెల్త్ కోచ్ రెండేళ్లపాటు విస్మరించిన లక్షణాలు ఇవే




మనలో చాలామంది చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను పెద్దగా పట్టించుకోరు. రాత్రిపూట చెమటలు పట్టడం, అలసట, అప్పుడప్పుడు వచ్చే నొప్పులు వంటి వాటిని పెద్ద సీరియస్ సమస్యలు కావనుకుంటారు. కానీ, కొన్నిసార్లు ఈ చిన్న లక్షణాలే ఏదో పెద్ద ప్రమాదానికి సంకేతాలు కావచ్చు. ప్రముఖ హెల్త్ కోచ్ దిలన్, ఏప్రిల్ 8న తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, తాను విస్మరించిన క్యాన్సర్ తొలి లక్షణాలను, అందరూ తప్పకుండా గమనించాల్సిన సంకేతాలను పంచుకున్నారు. అవేంటి?




**తొలి సంకేతాలు ఏంటి?**

"మొదట రాత్రిపూట చెమటలు పట్టడం మొదలైంది. కేవలం వేడిగా అనిపించడం కాదు.. నా దుప్పట్లు పూర్తిగా తడిసిపోయేలా చెమట పట్టేది" అని దిలన్ గుర్తు చేసుకున్నారు. "అర్ధరాత్రి బట్టలు మార్చుకునేవాడిని, మళ్ళీ నిద్ర లేచేసరికి పూర్తిగా చెమటతో తడిసిపోయేవాడిని" అని వివరించారు. "ఆ తర్వాత దురద మొదలైంది. ఎంత గోకినా తీరని విపరీతమైన దురద. నా చర్మం రక్తం వచ్చే వరకు గోకాను. ఆ తర్వాత అలసట లక్షణాలు కనిపించాయి. నిద్రతో కూడా తీరని విపరీతమైన అలసట. ఏదో తప్పు జరుగుతోందని నా శరీరం నాకు చెప్పడానికి తీవ్రంగా ప్రయత్నించింది" అని తెలిపారు. చివరికి ఛాతీ నొప్పి మొదలైనప్పుడు దిలన్ డాక్టర్ దగ్గరకు వెళ్లారు. "వారు అది బహుశా నా వర్కవుట్స్ వల్ల



కండరాల నొప్పి ఉంటుందని చెప్పారు" అని ఆయన వివరించారు. డాక్టర్లు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. "మరో 12 నెలల పాటు, తెలియని యుద్ధం చేస్తున్న నా శరీరంతో నేను జీవించాను" అని దిలన్ తెలిపారు. తన మెడపై, చంక కింద గడ్డలు కనిపించే వరకు దిలన్‌కి ఏదో తీవ్రమైన సమస్య ఉందని తెలియలేదు. ఈసారి డాక్టర్ పరీక్షలు చేయించమని సిఫారసు చేశారు. "పరీక్షల ఫలితం వచ్చింది..



నాలుగో దశ 4B హాడ్జికిన్స్ లింఫోమా" అని తేలింది.

"నా లోపల దాదాపు రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ పెరుగుతూనే ఉంది" అని ఆయన చెప్పారు. "నా ఊపిరితిత్తులలో కూడా ఒక కణితి ఉంది. ఏడాది క్రితం నేను చెప్పిన ఛాతీ నొప్పికి కారణం అదే. భయం, కోపం, నమ్మలేకపోవడం, ఆందోళన వంటి ఊహించని భావోద్వేగాలన్నీ నన్ను చుట్టుముట్టాయి" అని వివరించారు.

**25 ఏళ్లకే క్యాన్సర్ ఎలా వచ్చింది?**

"నా శరీరం ఏదో తేడా ఉందని గట్టిగా అరుస్తున్నప్పుడు 'బహుశా ఏమీ కాదులే' అని అంగీకరించకుండా, నేను మరింత గట్టిగా అడిగి ఉంటే బాగుండేది" అని దిలన్ వాపోయారు. "మీరు ఈ కథనాన్ని చదువుతుంటే, మీ శరీరంలో ఏదైనా తేడాగా అనిపిస్తే, దయచేసి ఆ భావనను వినండి. వైద్య నిపుణులు కూడా మీ ఆందోళనలను కొట్టిపారేయడానికి అనుమతించవద్దు. మీ ఆరోగ్యం చాలా విలువైనది. దానిని తేలికగా తీసుకోవద్దు." అని హితవు పలికారు. "క్యాన్సర్ నాకు నేర్పిన పాఠం ఏమిటంటే, మన శరీరాలు అరవడం మొదలుపెట్టడానికి ముందు మనకు గుసగుసలుగా మాట్లాడుతాయి. నా శరీరం ఎవరూ వినకముందే రెండేళ్ల పాటు గుసగుసలాడింది. అరుపు వచ్చే వరకు వేచి ఉండకండి." అని సూచించారు.

# పొగ తాగడం ఎంత ప్రమాదకరమో.. ప్రాసెస్ చేసిన ఆహారం అంతే..





ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు అంటే నోరూరిస్తాయి. వాటిని తినడం మొదలు పెడితే ఆపడం చాలా కష్టం. ఒకసారి తిన్నామంటే, ఇంకొంచెం కావాలనిపిస్తుంది. ఈ అలవాటు మన మెదడుపై పొగతాగడం లేదా మాదకద్రవ్యాలు తీసుకోవడం వంటి ప్రభావాలనే చూపిస్తుందని నిపుణులు అంటున్నారు. పొగతాగడం ఎంత ప్రమాదకరమో అందరికీ తెలుసు. దాని ప్యాకెట్ల మీద పెద్ద పెద్ద హెచ్చరికలు కూడా ఉంటాయి. అయినా సరే, చాలా మంది ఆ ఒక్క పఫ్ కోసం తమ పాత అలవాట్లలోకి జారిపోతూ ఉంటారు. పొగతాగడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలు తెలిసినా కూడా చాలా మంది దాన్ని వదులుకోలేకపోతారు.

ఇదేవిధంగా, ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్‌కు కూడా దాదాపు అలాంటి స్వభావం, ప్రమాదమే ఉన్నాయి. ఈ రంగులమయమైన, కరకరలాడే స్నాక్స్ మన ఆరోగ్యానికి ఎంత హానికరం అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయినప్పటికీ, ఇవి మనకు బాగా నచ్చిన ఆహారంగా, మనసు బాగోనప్పుడు తినే 'కంఫర్ట్ ఫుడ్' గా మారిపోయాయి. పుట్టినరోజు వేడుకలు, స్నేహితులతో సరదాగా గడపడం, డైట్ పక్కనపెట్టి తినే రోజులు (ఛీట్ మీల్స్) లేదా నిరుత్సాహంగా ఉన్నప్పుడు కాస్త ఉపశమనం కోసం వీటిని ఎంచుకోవడం మామూలైపోయింది. ఢిల్లీ వసంత్ కుంజ్ ఫోర్టిస్ హాస్పిటల్ లో గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శుభమ్ వత్స్య ఇచ్చిన ఇంటర్వ్యూలో జంక్ ఫుడ్, పొగతాగడం వల్ల కలిగే ప్రమాదాలు, అవి ఎంత వ్యసనపూరితమైనవో వివరించారు.

**ప్రాసెస్ చేసిన ఆహారం.. ఆరోగ్యానికి చేటు**

సాధారణంగా మనం ఇష్టపడే స్నాక్స్, అంటే ప్రాసెస్ చేసిన ఆహారాల గురించి డాక్టర్



శుభమ్ కొన్ని ప్రాథమిక విషయాలను పంచుకున్నారు. "ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు మార్కెట్లో విరివిగా లభిస్తాయి. కానీ అవి ఆరోగ్యకరమైనవి కావు. బదులుగా అనారోగ్యకరమైన కొవ్వులు, అధిక చక్కెర, ఉప్పు, కృత్రిమ సంకలనాలు వాటిలో నిండి ఉంటాయి" అని ఆయన చెప్పారు. "ఈ ఆహారాలు ఆరోగ్యానికి ఎంత హానికరం అని చూపించడానికి గణనీయమైన శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయి. అవి పొగతాగడం వల్ల కలిగే నష్టాలకు చాలావరకు పోల్చదగినవి. ఊబకాయం, గుండె జబ్బులు, క్యాన్సర్, చివరికి అకాల మరణానికి కూడా ఇవి దారితీస్తాయి" అని డాక్టర్ శుభమ్ హెచ్చరించారు.


**జంక్ ఫుడ్ కూడా పొగ తాగినంత వ్యసనకారకమేనా?**

ఫాస్ట్ ఫుడ్ చైన్లలో లభించే కొవ్వుతో కూడిన, చీజ్ బర్గర్‌లు లేదా ప్యాక్ చేసిన చిప్స్ వంటి ప్రాసెస్ చేసిన స్నాక్స్, మనసును ఎంతగానో ఆకర్షిస్తాయి. వాటిని తినకుండా ఉండటం చాలా



కష్టం. పొగతాగడం వల్ల మానసిక స్థితిని నియంత్రించుకోవడం ఎలా కష్టమవుతుందో, అలాగే జంక్ ఫుడ్ వ్యసనం కూడా మానసిక శ్రేయస్సుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

జంక్ ఫుడ్ తీసుకున్నప్పుడు మన మెదడు సిగరెట్లకు స్పందించినట్లే స్పందిస్తుందని డాక్టర్ వత్స్య నొక్కి చెప్పారు. "అవును, ఆహార వ్యసనం నిజం. శాస్త్రీయంగా రుజువైనదే. ఈ అనుబంధానికి సంబంధించిన మెకానిజం ఏమిటంటే, కొకైన్, సిగరెట్ వినియోగం ద్వారా సక్రియం అయ్యే మెదడులోని అదే డోపామైన్ మార్గాలు జంక్ ఫుడ్ ద్వారా కూడా సక్రియం అవుతాయి" అని ఆయన వివరించారు. "అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు, కొవ్వు డోపామైన్‌ను విడుదల చేస్తాయి. ఇవి మీ శరీర ఆకలి సంకేతాలను తప్పుగా అంచనా వేసి, మిమ్మల్ని ఎక్కువగా తినేలా చేస్తాయి. సిగరెట్ల మాదిరిగానే, ఈ స్నాక్స్ తరచుగా మానసిక ఆధారాలుగా మారతాయి. విసుగు, ఒత్తిడి లేదా సామాజిక ఒత్తిడిని ఎదుర్కోవడానికి వీటిని ఉపయోగిస్తారు. కాలక్రమేణా, ఈ అలవాటు నుండి బయటపడటం చాలా కష్టంగా మారుతుంది" అని ఆయన వివరించారు.



# సమంత స్థానంలో?

సినిమాల్లో కథానాయికల మార్పు సాధారణమే. అయితే ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో ఓ నాయిక స్థానాన్ని మరొకరు భర్తీ చేయడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు అలాంటి మార్పే 'చెన్నై స్టోరీ' విషయంలో జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లో తొలుత సమంతను కథానాయికగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు విరామం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమంత స్థానంలో శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. బాఫ్టా అవార్డు విజేత, డౌన్‌టౌన్ అబ్బే వంటి సినిమాలతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న ఫిలిప్‌జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' తెరకెక్కుతున్నది. టిమెరి ఎన్ మురారి రచించిన 'ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చెన్నై, ఇంగ్లాడ్‌లోని వేల్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో కథానాయిక ప్రైవేట్ డిటెక్టివ్ పాత్రలో కనిపించనుంది. అయితే ఈ సినిమా నుంచి సమంత తప్పుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. అంతర్జాతీయ నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.



# 'టైగర్ 3' దర్శకుడితో సారా?

బాలనటిగా కెరీర్ ఆరంభించి.. ప్రస్తుతం అగ్రతారల అవకాశాల్ని అందుకుంటూ కెరీర్‌లో మంచి జోష్ మీదుంది బాలీవుడ్ యువకథానాయిక సారా అర్జున్. ఈ మధ్యే 'ధురంధర్' చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకొని బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ తార.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'టైగర్ 3' ఫేమ్ మనీశ్ శర్మతో ఓ చిత్రం కోసం సారా చేతులు కలిపినట్లు సమాచారం. "పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దీన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నారు దర్శకుడు. ఇందులో సారా సరసన 'సప్నే వర్సెస్ ఎవ్రీవన్' చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న అంబ్రీశ్ వర్మ కనిపించనున్నారు. ప్రస్తుతం చిత్రబృందం నాయికతో చర్చలు చేస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి" అని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



# మా టీమ్ వాళ్లే వద్దన్నారు!

"'దసరా' నాకు చాలా ఇష్టమైన సినిమా. దాని విషయంలో నాకెలాంటి అసంతృప్తి లేదు. కాకపోతే ఈ మధ్య దీని గురించి నాని అన్న చెప్పిన మాట.. జనాల్లోకి వేరేలా వెళ్లింది. నిజానికి ఆ సినిమా క్లాస్ టచ్‌తో ఉంటుందని నాకు ముందు నుంచీ అవగాహన ఉంది. ద్వితీయార్థమంతా వెన్నెల చుట్టూ తిరిగే ప్రేమకథే. కానీ, ఆ చిత్ర పోస్టర్లు, ప్రచార చిత్రాలు చూసి ప్రేక్షకులు ఇదేదో 'కేజీఎఫ్' లాంటి మాస్, కమర్షియల్ యాక్షన్ చిత్రమనుకుని థియేటర్లకు వచ్చారు. తీరా తెరపై చూస్తే ఎమోషనల్ డ్రామా కనిపించేసరికి తొలి రెండు రోజులు ప్రేక్షకులు కాస్త నిరుత్సాహపడ్డారు. 'హీరో ఏదో నరికేస్తాడనుకుంటే.. వెన్నెల వెనుక తిరుగుతున్నాడేంటి?' అని ఫీలయ్యారు. అయితే ఆ తర్వాత కథలోని ఎమోషన్‌కి అందరూ బాగా కనెక్ట్ అయి ఆ చిత్రాన్ని పెద్ద హిట్ చేశారు. కానీ, ఓ దర్శకుడిగా నాలో ఓ చిన్న అసంతృప్తి మిగిలిపోయింది. 'ప్రేక్షకులు ఏదో ఊహించుకుని వస్తే.. మనం వేరేది ఇచ్చాం.. అదే వారు ఆశించిన మాస్ కమర్షియల్ కంటెంట్‌నే నా శైలిలో ఇస్తే ఎలా ఉంటుంది?' అనిపించింది. అదే విషయాన్ని నాని అన్నతో చెప్పా. 'దసరా'తో బ్లాక్‌బస్టర్ కొట్టాం. మంచి వసూళ్లు వచ్చాయి. కానీ, ఈసారి ప్రేక్షకులు కోరుకున్నట్లు మంచి మాస్




ఎక్స్‌పీరియన్స్‌తో పూర్తిస్థాయి సంతృప్తిని అందివ్వాలనే ఉద్దేశంతో 'ది ప్యారడైజ్'కి శ్రీకారం చుట్టాం".

# రెండు భాగాలూ... ఏకకాలంలో!

కొనసాగింపు చిత్రాలు, యూనివర్స్ సినిమాలు, ఫ్రాంచైజీలు... ఇలా కొత్త కొత్త పేర్లతో ఈ మధ్య సినిమాలు సందడి చేస్తున్నాయి. అగ్ర కథానాయకుల చిత్రాలనగానే ఈ పేర్లు కచ్చితంగా ప్రచారంలోకి వస్తుంటాయి. పెద్ద కథలు, భారీ హంగుల కారణంగా ఆయా కథల్ని, కథా ప్రపంచాల్ని ఒక భాగంతో సరిపెట్టకుండా... తదుపరి కూడా కొనసాగించేందుకు ప్రయత్నిస్తుంటారు దర్శకనిర్మాతలు. అది మార్కెట్ వ్యూహంలో ఓ భాగం కూడా! ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' కథ కూడా పలు భాగాలుగా కొనసాగనుందని సమాచారం. చాలావరకు సినిమాలు ఒక భాగం ప్రేక్షకుల ముందుకొచ్చాకే, మరో భాగం పనులు మొదలవుతుంటాయి. అయితే 'డ్రాగన్' మాత్రం ఏకకాలంలోనే రెండు భాగాల చిత్రీకరణని పూర్తి చేసుకొంటోందని సమాచారం.

తొలి భాగం విడుదలైన కొన్ని రోజుల్లోపే, మరో భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే వ్యూహంతో చిత్రబృందం పనిచేస్తున్నట్టు సమాచారం. అందుకే కథానాయకుడు ఎన్టీఆర్ గాయం కారణంగా కొన్ని రోజులుగా సెట్‌కి దూరంగా ఉంటున్నప్పటికీ, 'డ్రాగన్' చిత్రీకరణ మాత్రం కొనసాగుతోంది. ఎన్టీఆర్ లేని సన్నివేశాల్ని ఇతర తారాగణంపై తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ లూగర్ పాత్రలో సందడి చేయనున్న విషయం తెలిసిందే. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ కపూర్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు.



# స్పృహ తప్పి పడిపోయిన భారత అథ్లెట్



జపాన్‌లో ఆసియా క్రీడలు ఘనంగా జరుగుతున్నాయి. భారత్‌కు చెందిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ వరుణ్ సన్యాల్ అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధమవుతుండగా.. అతడు క్రూయిజ్ షిప్‌లో స్పృహ తప్పి పడిపోయినట్లు ఎంఎంఏ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నిఖిల్ కుందేరా వెల్లడించారు. నేపాల్‌కు చెందిన అథ్లెట్ వరుణ్ సన్యాల్‌ను గమనించి.. సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. అనారోగ్యం కారణంగా అతడు క్వార్టర్ ఫైనల్ నుంచి డిస్‌క్వాలిఫై అయినట్లు సమచారం. ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ కుమారుడే వరుణ్ సన్యాల్.

# ఆసియా అదిరేలా..

నగోయా: ఆసియా క్రీడాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటే ఆటల పండుగ మొదలైంది. నిర్వహణ లోపాలు, ఇరుకైన వసతుల వివాదాలను పక్కనబెడుతూ 20వ ఎడిషన్ ఆసియా గేమ్స్ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఐచి-నగోయా వేదికగా హార్మోనిక్ హార్ట్‌బీట్ (హృదయాల స్పందన) అనే ప్రధాన ఇతివృత్తంతో సాగిన ప్రారంభోత్సవంలో ఆతిథ్య జపాన్ తన హైటెక్ పారిశ్రామిక శక్తిని, ప్రాంచీన సాంస్కృతిక మూలాలను ప్రపంచానికి చాటిచెప్పింది. మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య అధిపతి కోవర్ట్రీ, ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ అధ్యక్షుడు అల్ థానీ సమక్షంలో జపాన్ చక్రవర్తి నరుహిటో క్రీడలను అధికారికంగా ప్రారంభించారు. అక్టోబర్ 4 వరకు జరిగే మెగా ఈవెంట్‌లో 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు 43 క్రీడల్లో పోటీపడనున్నారు.





# వలవరిన్ అద్భుతం.. సింగిల్స్‌లోనూ సిల్వర్ మెడల్

ఆసియా క్రీడల్లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలవరిన్ అద్భుతం చేసింది. ఇప్పటికే టీమ్ విభాగంలో రజతం సాధించిన ఆమె.. వ్యక్తిగత విభాగంలోనూ పతకం సొంతం చేసుకుంది. 10 మీటర్ల రైఫిల్ విభాగంలో రెండో ప్లేస్ సాధించింది. జపాన్‌కు చెందిన హినట టైచి 253 పాయింట్లు సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. వలవరిన్ 252.4 పాయింట్లతో సిల్వర్ మెడల్‌ను దక్కించుకుంది. సౌత్ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ (230.4) మూడో ప్లేస్‌లో నిలిచి కాంస్యం అందుకొంది.

**టీమ్ ఈవెంట్‌లోనూ..**

అంతకుముందు ఆసియా క్రీడల్లో (2026) భారత్‌కు తొలి పతకం షూటింగ్ విభాగంలో వరించింది. మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రజత పతకాన్ని సాధించింది. ఎలావెనిల్ వలరివన్, సోనం, విదర్శ వినోద్‌ల త్రయం అద్భుత ప్రదర్శనతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ విభాగంలో చైనా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.



# 8 గోల్స్‌తో అదరగొట్టిన దీపిక

ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల హాకీ జట్టు అదరగొట్టింది. ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 19-0తో ఘన విజయం సాధించింది. గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ ఆరో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. నవనీత్ కౌర్ కొట్టిన షాట్‌ను ఉజ్బెకిస్థాన్ గోల్‌కీపర్ రుషానా చోరీయేవా అడ్డుకోగా.. రీబౌండ్‌ను లాల్‌రెమ్‌సియామి గోల్‌గా మలిచింది. ఆ తర్వాత భారత ఆటగాళ్లు వరుస దాడులతో ఉజ్బెకిస్థాన్ రక్షణను ఒత్తిడిలోకి నెట్టారు. తొలి రెండు క్వార్టర్లు ముగిసే సమయానికి భారత్ 5-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో పలువురు భారత ఆటగాళ్లు గోల్స్ సాధించారు. మూడో క్వార్టర్‌లో దీపిక తన డ్రాగ్‌ఫ్లిక్ నైపుణ్యంతో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై విరుచుకుపడింది. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకున్న ఆమె ఏకంగా 8 గోల్స్ చేసింది. ఇందులో నాలుగు గోల్స్ మూడో క్వార్టర్‌లోనే రావడం విశేషం. భారత్ తరఫున దీపిక 8 గోల్స్‌తో మెరిసింది. ఇషిక 3, నవనీత్ కౌర్ 2, లాల్‌థంత్లువాంగి 2, లాల్‌రెమ్‌సియామి, బాల్జీత్ కౌర్, నేహా, సాక్షి రాణా ఒక్కో గోల్ చేశారు.

# సెమీస్‌లో బంగ్లా చిత్తు.. ఫైనల్‌లో భారత అమ్మాయిలు

ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. క్రికెట్‌లో భారత మహిళా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. దీంతో శ్రీలంకతో తుది పోరులో తలపడనుంది. మంగళవారం ఫైనల్ జరగనుంది. ఇక కాంస్య పతకం కోసం పాకిస్థాన్ - బంగ్లాదేశ్ తలపడతాయి.

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (100*: 49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లు) శతకం బాదేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (40), స్మృతి మంధాన (37) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తెర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందని శర్మ 3, శ్రీ చరణి 2.. క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తీశారు.

**షఫాలీ ధనాధన్..**

ఆసియా కప్ నుంచి మంచి ఫామ్‌లో ఉన్న షఫాలీ వర్మ.. ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ అదే జోష్ కొనసాగిస్తోంది. ఇక సెమీస్‌లో బంగ్లా బౌలింగ్‌ను ఊచకోత కోసింది. చివరి ఓవర్ వరకూ క్రీజ్‌లో ఉండిపోయిన ఆమె.. సిక్సర్ల వర్షం కురిపించింది. స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. గుణాలన్ కమలిని (3) విఫలమైనా.. హర్మన్‌తో కలిసి షఫాలీ మరింత దూకుడుగా ఆడింది. 94 పరుగులు జోడించింది. ఆఖర్లో రిచా ఘోష్ (9*) సిక్స్ కొట్టడంతో భారత్ స్కోరు 190+ దాటేసింది. బంగ్లా బౌలర్లలో మరుఫా, షాన్‌జిదా, రెబయా, నహిదా తలో వికెట్ తీశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU, ASSOCIATE EDITOR MARUTHI BIKSHA REDDY Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945